
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రత గురువారం గరిష్ఠం : 31.0 కనిష్ఠం : 23.0

ANDHRAJYOTHY

5



శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు

శుక్రవారం 27 జూన్ 2025

సీఎం పర్యటనను విజయవంతం చేయాలి: కలెక్టర్

కొత్తచెరువు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): వచ్చేనెల 5న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కొత్తచెరువులో పర్యటించే అవకాశం ఉంది. ఈ పర్యటనపై జిల్లా యంత్రాంగానికి పూర్తి స్థాయి అధికారిక సమాచారం అందాల్సి ఉంది. ఈమేరకు గురువారం కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ వి.రత్న, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, ఆర్డీఓ సువర్ణ ప్రభుత్వ జూనియర్ కళాశాల క్రీడామైదానాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..ముఖ్యమంత్రి జూలై 5న తల్లికి వందనంపై విద్యార్థుల తల్లిదండ్రులతో ముఖాముఖీ సమావేశానికి రానున్నారని, అధికారులు సమన్వయంతో ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలన్నారు. పర్యటనకు వచ్చే మంత్రులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట డీఈఓ కిష్టప్ప, విద్యాశాఖ జేడీ సుబ్బారావు, ఎస్ఎస్ఏ పీఓ దేవరాజ్, ఇతర శాఖల అధికారులు ఉన్నారు.



అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ టీఎస్ చేతన్



ఉప్పునేసినపల్లిలో తాగునీటి సమస్యపై ఆరా తీస్తున్న డిప్యూటీ ఎంపీడీఓ వెంకటేష్ తదితరులు

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

● ఉప్పునేసినపల్లిలో పర్యటించిన అధికారులు

ధర్మవరం రూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉప్పునేసినపల్లి ఎస్టీ కాలనీలో తాగునీటి సమస్యపై ఈనెల 25న ఆంధ్రజ్యోతిలో 'నీళ్ల తిప్పలు' అనే కథనం ప్రచురితమైంది. ఈ కథనంపై ఎంపీడీఓ సాయిమనోహర్ స్పందించారు. ఆయన ఆదేశాల మేరకు గురువారం డిప్యూటీ ఎంపీడీఓ వెంకటేష్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేష్ గ్రామానికి వెళ్లి తాగునీటి సమస్యపై పరిశీలించారు. కాలనీకి సరఫరా అయ్యే తాగునీటి పైపులైన్ ఆర్అండ్‌బీ రోడ్డు కింద ఉందని, ఆ పైపులోకి మట్టి కూరుకుపోవడంతో సమస్య తలెత్తిందని ప్రజలు వివరించారు. పైపులైన్‌కు మరమ్మతులు చేయిస్తామని, లేదా నూతన బోరు వేయించి తాగునీటి సమస్య పరిష్కరిస్తామని తెలిపారు. వారి వెంట పంచాయితీ కార్యదర్శి చరిత ఉన్నారు.

అయ్యే పనేనా..?

ముంచుకొస్తున్న గడువు

హంద్రీనీవా పనుల పూర్తిపై ఉత్కంఠ

యుద్ధ ప్రాతిపదికన చేస్తామంటున్న అధికారులు

పుట్టపర్తి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): హంద్రీనీవా కాలువ ఆధునికీకరణ పనులు గడువులోగా పూర్తి చేస్తారా? అన్న ఉత్కంఠ ఉమ్మడి జిల్లా రైతుల్లో నెలకొని ఉంది. గతంలో ఎన్నడూలేని విధంగా వంద రోజుల ప్రణాళికతో ఒకేసారి అన్ని ప్యాకేజీల్లో లైనింగ్ పనులు ప్రారంభించారు. యుద్ధప్రాతిపదికన ఆధునికీకరణ పనులు మొదలు పెట్టినా జూన్ 10 నాటికే గడువు ముసింది. దీంతో జూలై 1 వరకు గడువు పొడిగించారు. ఆ లోపైనా పూర్తవుతాయా లేదా అన్న సందేహం నెలకొంది. వైసీపీ పాలనలో హంద్రీనీవా ప్రాజెక్టు నిర్లక్ష్యానికి గురైంది. గత సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం కొలువుదీరిన నెలల వ్యవధిలోనే ఆధునికీకరణ పనులు చేపట్టారు.



రెండో విడత కాలువ లైనింగ్ పనులు

డిసెంబరులోనే ఉత్తర్వులు

హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులకు నిధులు మంజూరు చేసి గతేడాది డిసెంబర్లోనే ఉత్తర్వులు జారీ చేశారు. జనవరిలో టెండర్లు పూర్తి కాగానే పనులు మొదలు పెట్టారు. హంద్రీనీవా రెండో విడత ప్రధాన కాలువ పుంగనూరు ఉప కాలువ (పీబీసీ) ఆధునికీకరణ (లైనింగ్) పనులు చేపట్టారు. ఇందులో హంద్రీనీవా రెండో విడత ప్రధాన కాలువ జీడిపల్లి జలాశయం వద్ద 216 కి.మీ నుంచి 400, 500 కి.మీ దాకా మొత్తం 184.200 కి.మీ లైనింగ్ పనులు జరుగుతున్నాయి. ఐదు ప్యాకేజీలుగా విభజించి మొత్తం రూ.936.70 కోట్ల అంచనాలతో పనులు చేపట్టారు. జీడిపల్లి జలాశయం నుంచి రెండో విడత కాలువకు వెయ్యి క్యూసెక్కులకు మించి వెళ్లకపోవడంతో 2520 క్యూసెక్కుల మేర నీటి ప్రవాహం కొనసాగేలా పనులు చేపట్టారు. ఉరవకొండ, రాప్తాడు, ధర్మవరం, పుట్టపర్తి, కదిరి నియోజక వర్గాల మీదుగా ఈప్రధాన కాలువ వెళ్తుంది. పుంగనూరు ఉప కాలువ (పీబీసీ)లైనింగ్ పనులు ప్రారంభించారు. రూ.266.24 కోట్ల ఒప్పందంతో పనులు మొదలు పెట్టారు. జూలై5న జిల్లాకు ముఖ్యమంత్రి చంద్రబాబు రానున్న నేపథ్యంలో లైనింగ్ పనులు మరింత వేగంగా చేసేలా పనులు చేపడుతున్నారు.

జూలై 10కి పూర్తయ్యేనా?

జిల్లాలో ఐదు ప్యాకేజీల కింద చేపట్టిన ఆధునికీకరణ పనులు ఇప్పటిదాకా 48శాతం పూర్తి అయినట్లు సమాచారం. జీడిపల్లి జలా శయం నుంచి కాలువకు ఇరువైపులా లైనింగ్ పనులు చేపట్టారు. చాలా చోట్ల కాలువల్లో నీరు నిల్వ ఉండటం, మధ్యలో వర్షాలు రావడంతో ఈ పనులు సాఫీగా సాగలేదు. వంద రోజుల ప్రణాళికతో ఫిబ్రవరి నెలాఖరులో లైనింగ్ పనులు ప్రారంభించారు. చాలా చోట్ల కాలువకు ఇరువైపులా ముళ్లపొదలు తొలగించారు. అయితే బెడ్డింగ్ చేపట్టాల్సి ఉంది. వంద రోజుల గడువు జూన్ పదో తేదీకే ముగిసినా దాన్ని జూలైకి 10కి పొడిగించారు. ఈ 14 రోజుల్లో మిగిలిన పనులను ఎలా పూర్తి చేస్తారన్న సందేహాలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి. కొన్ని నియోజకవర్గాల్లో టెండర్లు దక్కించుకున్న సంస్థలు వేగం పెంచకపో వడంతోనే పనులు నెమ్మదించినట్లు తెలుస్తోంది. హంద్రీనీవా అధికా రులు మాత్రం గడువులోగా పనులు పూర్తి చేస్తామని చెబుతున్నారు. అయితే వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో ఎప్పుడైనా పనులకు వాన అడ్డంకిగా మారే అవకాశం ఉంది.



కాలువ ఇరువైపులా లైనింగ్ పనులు

> **యుద్ధ ప్రాతిపదికన పనులు**
>
> లైనింగ్ పనులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాం. జూలై పదో తేదీకి పనుల్ని పూర్తి చేసేలా వేగం పెంచాం. వర్షం అడ్డంకిగా మారినా పనుల్లో మాత్రం ఎక్కడా వేగం తగ్గలేదు. నిధుల సమస్య లేకపోవడం గడువులోపు పనులు పూర్తి చేస్తామనే నమ్మకం మాకు ఉంది.
>
> - రాజా స్వరూప్‌కుమార్, ఎస్ఈ, హంద్రీనీవా



ర్యాలీలో పాల్గొన్న కలెక్టర్ టీఎస్ చేతన్, ఎస్పీ రత్న, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

జిల్లాను మాదకద్రవ్య రహితంగా

తీర్చిదిద్దుదాం

● కలెక్టర్ చేతన్, ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్య రహిత జిల్లాగా తీర్చిదిద్దుదామని కలెక్టర్ చేతన్, జిల్లా ఎస్పీ రత్న, ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పిలుపునిచ్చారు. కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్య దుర్వినియోగం, అక్రమరవాణా వ్యతిరేక దినాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక ఆర్టీసీ బస్టాండ్ నుంచి గణేష్ కూడలి వరకు వాకథాన్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ యువత మంచి చెడులను బేరీజు వేసుకుని మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. డ్రగ్స్ మహమ్మారి మొగ్గగా ఉన్నప్పుడే తుంచేయాలనే ఉద్దేశంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. తెలిసీ తెలియని వయస్సులో డ్రగ్స్ బారిన పడితే బంగారు భవిష్యత్తు నాశనం అవుతుందని హెచ్చరిం చారు. ఎస్పీ మాట్లాడుతూ యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. పెడదారినపడి బంగారు భవిష్యత్తును, కుటుంబాలను విచ్ఛిన్నం చేసుకోకూడదన్నారు. మాదకద్రవ్యాలు వినియోగం, అమ్మకం, రవాణా తదితర విషయాలు తెలిసిన వెంటనే టోల్‌ఫ్రీ నెంబర్ 1972కు సమాచారం అందచేయాలన్నారు. ఎమ్మెల్యే పల్లె సింధూర మాట్లాడుతూ యువత పెడదారిన పడకుండా జాగ్రత్తగా మసలు కోవాలన్నారు. మత్తుపదార్థాలకు అలవాటు పడి జీవితాలను నాశనం చేసుకోవద్దన్నారు. మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి మాట్లాడుతూ మాదకద్రవ్య వినియోగం నుంచి యువతను దూరం చేయాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. అనంతరం మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞచేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ సువర్ణ, ఎక్సైజ్ శాఖా జిల్లా అధికారులు నాగమద్దయ్య, గోవింద నాయక్, డీఎస్పీలు విజయ్‌కుమార్, శ్రీనివాసులు, ఆదినారాయణ, లీగల్‌టీం సభ్యులు, మునిసిపల్ చైర్మన్ తుంగ ఓబులపతి, మునిసిపల్ కమిషనర్ క్రాంతికుమార్, టీడీపీ జనసేన నాయకులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



గణేష్ కూడలిలో మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్



సమగ్రశిక్ష కార్యాలయం

సమగ్రశిక్షలో పర్యవేక్షణ

గాలికి..!

ఉన్నతాధికారుల మధ్య కొరవడిన సమన్వయం

● ప్రభుత్వ బడులకు రూ.కోట్ల ఖర్చు

● మెరుగుపడని ప్రమాణాలు

అనంతపురం విద్య, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఉన్నతాధికారుల మధ్య సమన్వయ లోపం, ఆధిపత్య పోరుతో సమగ్రశిక్షలో పర్యవేక్షణ గాలికి వదిలేశారు. అందరికీ ఉచిత విద్యను అందించాలన్న లక్ష్యంతో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు సర్వశిక్షా అభియాన్‌ను తీసుకు వచ్చాయి. 2000-2001 విద్యా సంవత్సరంలో ప్రతిష్ఠాత్మకంగా ఈ వ్యవస్థను తీసుకొచ్చి వివిధ పథకాల కింద నిధులు ఇస్తూ రూపురేఖలు మారుస్తున్నాయి. ప్రభుత్వ బడులలోనూ కార్పొరేట్ స్థాయిలో విద్యాప్రమాణాలు పెంచడానికి ఎన్నోవసతులు, సాంకేతికతను తీసుకొచ్చారు. ఒకప్పుడు ఈశాఖ గురించి ఎంతో గొప్పగా చెప్పుకునేవారు. అలాంటి శాఖ ఇప్పుడు సమన్వయ లోపంతో కొట్టుమిట్టాడుతోంది. ఇపుడు సమగ్రశిక్షగా పేరు మార్చారు. ఇప్పటికీ ఎస్ఎస్ఏ ద్వారా పెద్దఎత్తున నిధులు వస్తున్నాయి. అనుకున్నస్థాయిలో విద్యాప్రమాణాలు మెరుగుపడడంలేదని ప్రభుత్వం చేయిస్తున్న వివిధ సర్వేలలో బయటపడుతోంది. సరైన పర్యవేక్షణ లేపోవడం వల్లే ఈ పరిస్థితి దాపురించిందని తెలుస్తోంది.

పథకాలు అమోఘం.. నిధులు అనేకం

అనంతపురం జిల్లాలో విద్యాశాఖ అధికారుల లెక్కల ప్రకారం.. అన్ని యాజమాన్యాల కింద మొత్తం 1718 పాఠశాలలు ఉన్నాయి. ఇందులో ప్రభుత్వ పాఠశాలలు 39, మండల పరిషత్, జడ్పీ పాఠశాలలు 1480, మున్సిపాలిటీ 152, ఏపీ మోడల్ స్కూల్స్ 15, కేజీబీవీలు 32 ఉన్నాయి. ఈ పాఠశాలలన్నింటికీ సమగ్రశిక్ష శాఖ ద్వారానే విద్యాపథకాలు అమలు చేస్తున్నారు. ప్రధానంగా స్కూల్‌గ్రాంట్స్, కాంప్లెక్స్ గ్రాంట్స్, ఎంఆర్‌సీ గ్రాంట్స్, విద్యార్థులకు ఉచితంగా పుస్తకాలు, యూనిఫామ్స్, షూస్‌తో పాటు **(మిగతా 6వ పేజీలో..)**

ప్రతి ఒక్కరికీ బ్యాకింగ్ సేవలు అందించాలి

బ్యాంకర్ల సమావేశంలో కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా ప్రతి ఒకరికి బ్యాకింగ్ సేవలందించాలని కలెక్టర్ చేతన్ బ్యాంకర్లను ఆదేశిం చారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో జిల్లాలోని బ్యాంకర్లతో గురు వారం ఆయన సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాల్లో ఐదు వేలకుపైగా జనాభా ఉండి, బ్యాకింగ్ సౌకర్యం లేని అమడగూరు మండలంలోని తుమ్మల, ధర్మవరం మండలంలోని రాయలచెరువు, హిందూపురంలోని చలివేందల, మునుగురు, మడకశిర మండలంలోని ఆమిదాలగొంది, ముదిగుబ్బ మండలంలోని గుంజేపల్లి, దొరిగిల్లు, పరిగి మండలంలోని మోద, రామగిరి మండలంలోని నసనకోట, రోళ్ల మండలంలోని బొమ్మగుండన, తలుపుల మండలంలోని పెద్దన్నవారిపల్లి, తనకల్లు మండలంలోని కొక్కంటి గ్రామాల్లో వీలైనంత త్వరగా బ్యాంకు శాఖలను ప్రారంభించాలని ఆదేశించారు. కేంద్ర జనసురక్ష పథకాలైన జన్‌ధన్‌యోజన, సురక్ష బీమాయోజన, జీవన్‌జ్యోతి యోజన, అటల్ పింఛన్ యోజన తదితర పథకాలపై జూలై 1నుంచి సెప్టెంబరు 30వరకు అవగాహన కల్పించాలన్నారు. ప్రధానమంత్రి బీమాయోజన పథకం ద్వారా యేడాదికి రూ.456లు ప్రీమియం చెల్లించడం ద్వారా రూ.రెండులక్షల బీమా సౌకర్యం పొందవచ్చన్నారు. కార్యక్రమంలో జిల్లా లీడ్ బ్యాంక్ మేనేజర్ రమణకుమార్, పరిశ్రమల శాఖ జీఎం నాగరాజు, డీఆర్‌డీఏ ఏపీఎం రాజశేఖర్, నాబార్డు అధికారిణి అనురాధ, రూట్‌సెట్ డైరెక్టర్ విజయలక్ష్మి, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, ఏడీసీసీ, ఏపీజీబీ తదితర బ్యాంక్ అధికారులు పాల్గొన్నారు.



బ్యాంకర్లతో సమీక్షిస్తున్న కలెక్టర్ చేతన్

జగన్‌ను ఎందుకు అరెస్టు చేయకూడదు..?

● ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర టౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పుష్ప సినిమా తొక్కిసలాట ఘటనలో ఒక్కరు మరణిస్తే హీరో అల్లు అర్జున్‌ను పోలీసులు అరెస్టు చేశారని, రాజకీయ బల ప్రదర్శనకు వెళ్లి, ఒకరి మరణానికి కారణమైన జగన్‌ను ఎందుకు అరెస్టు చేయకూడదో వైసీపీ పార్టీ నాయకులు చెప్పాలని ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అన్నారు. తన క్యాంపు కార్యాలయంలో టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామితో కలసి గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. చేసిన తప్పును కప్పిపుచ్చుకునేందుకు జగన్ ఎదురుదాడి చేస్తున్నారని విమర్శించారు. పొదిలిలో జగన్ పర్యటన వల్ల శాంతిభద్రతలకు విఘాతం కలుగుతుందని పోలీసులు ముందే చెప్పినా ఎందుకు వినలేదని ప్రశ్నించారు. ఎన్నికల సమయంలో వైసీపీ గెలుస్తుందని రూ.30 కోట్లు బెట్టింగ్ కట్టి, తమ ప్రభుత్వం ఏర్పాటు కాకనే ఒకరు మరణిస్తే.. దాన్ని రాజకీయం చేస్తున్నారని మండిపడ్డారు. ఒక వ్యక్తి తన కారు కింద పడి మరణించడాన్ని ఆయన సమర్థించుకుంటున్నారని అన్నారు. పుష్ప సినిమా తొక్కి సలాటకు అల్లు అర్జున్‌ను బాధ్యుడిని చేసినట్లే.. పోలీసులు జగన్‌ను అరెస్టు చేయాలని అన్నారు. తప్పు చేసిన వారిని ప్రభుత్వం వదలదని అన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న ఎంఎస్ రాజు

ఆరంభంలోనే

చీడపీడలు

6

గంజాయిని రాష్ట్రానికి పరిచయం చేసింది

వైసీపీనే

● బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

7

తల నరికేశారు..!

మైదుగోళంలో వ్యక్తి దారుణ హత్య

లేపాక్షి మండలం మైదుగోళం గ్రామంలో రవి కుమార్ అనే వ్యక్తి తలను నరికేశారు. డిన్నర్ పేరిట మూడు రోజుల క్రితం గ్రామ శివారుకు తీసుకెళ్లి.. తల నరికి మొండెం నుంచి వేరు చేశారు. వివాహేతర సంబంధమే ఈ హత్యకు కారణమని పోలీసులు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. హతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

(వివరాలు 6లో)



రవికుమార్ (ఫైల్)

కేవీకే ఏర్పాటుకు స్థల పరిశీలన

బత్తలపల్లి జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని గుమ్మల్లకుంట సమీపంలోని కృషి విజ్ఞానం కేంద్రం(కేవీకే) ఏర్పాటుకు వైఎస్ఆర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అధికారులు గురువారం భూమిని పరి శీలించారు. మంత్రి సత్యకుమార్ చొరవతో కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటుకు 68 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించింది ఆభూమిని వైఎస్ఆర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యములో నిపుణుల కమిటీ పరిశీలించింది. ఆ భూమిలో మట్టిని సేకరించి పరీక్షలకు పంపారు. వీటి ఫలితాల నివేదికను జూలై1లోగా ప్రభుత్వానికి సమర్పించ నున్నారు. కార్యక్రమములో కమిటీ సభ్యులైన రాయలసీమ అసోసియేట్ డైరక్టర్ మధుమతి, శాస్త్రవేత్తలు సుబ్రహ్మణ్యమ్మ, శివప్రసాద్, బాలకృష్ణ, ఆర్డీఓ మహేష్, తహసీల్దార్ స్వర్ణలత, హార్టికల్చర్ అమరేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



కృషి విజ్ఞాన కేంద్రానికి భూమిని పరిశీలిస్తున్న అధికారులు

ఫసల్ బీమాలో నమోదు చేసుకోండి

పుట్టపర్తిరూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో జిల్లా రైతులు తమ పంటలను నమోదు చేసుకోవా లని జిల్లా వ్యవసాయ అధికారి సుబ్బారావు గురువారం ఓ ప్రకటనలో కోరారు. ఖరీఫ్- 2025 సీజన్‌కు సంబంధించి (ఇఫ్‌కో-టోకియో కంపెనీ అమలుచేసే బీమాపథకం) జిల్లాలో దిగుబడుల ఆధారంగా పంటల బీమా కొరకు కంది, వరి, మొక్కజొన్న, ఆముదం, రాగి, పంటలను నమోదు చేసుకోవాలన్నారు. వాతావరణ బీమా పథకంలో భాగంగా పత్తి, వేరుశనగ, దానిమ్మ, బత్తాయి, టమోటా పంటలకు కూడా బీమా చేసుకోవచ్చన్నారు. ఇందులో కంది పంటకు ఎకరాకు రూ. 102, వరి పంటకు రూ. 200, మొక్కజొన్నకు రూ. 165, ఆముదం, రాగిపంటలకు రూ.100, పత్తిపంటకు రూ.1900, వేరుశనగకు రూ.640, దానిమ్మ పంటకు రూ. 3750, బత్తాయిపంటకు రూ. 2750, టమోటా పంటకు రూ. 1600 ప్రీమియాన్ని రైతులు చెల్లించాల్సి ఉంటుందన్నారు. రైతులు పంట రుణం తీసుకునేటప్పుడు బీమా చేయించుకోవచ్చన్నారు.

పాపను అమ్మేశారు..!

కదిరి మండలం మరవ తండాకు చెందిన తల్లిదండ్రులు తమ మూడేళ్ల కూతురును కేరళలో అమ్మేశారు. కూలి పనులు చేసుకునే వీరికి ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. కుటుంబ పేదరికం, తండ్రి అనారోగ్యం ఆ చిన్నారికి శాపంగా మారింది. రెండు నెలల క్రితం ఉపాధి కోసం కేరళకు వెళ్లిన దంపతులు.. పాపను అమ్మేసి తిరిగొచ్చారు. దీంతో తన మనవరాలు ఏమైందని తాత నిలదీశాడు. అల్లుడితో గొడవపడ్డాడు. ఇలా విషయం బయటకు పొక్కింది. పోలీసులు తల్లిదండ్రులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. పాపను తిరిగి తీసుకువచ్చేందుకు కేరళకు వెళ్లేందుకు సిద్ధమయ్యారు. (వివరాలు మెయిన్‌లో...)



చిన్నారి తల్లిదండ్రులను వాహనంలో తరలిస్తున్న పోలీసులు

మై భారత్‌గా ఎన్‌వైకే

మై భారత్ ఏపీ డైరెక్టర్ అన్షుమన్ ప్రసాద్‌దాస్



మై భారత్ ఏపీ డైరెక్టర్ అన్షుమన్ ప్రసాద్‌దాస్‌ను సన్మానిస్తున్న అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): నెహ్రూ యువకేంద్రం(ఎన్‌వైకే)ను మై భారత్‌గా మార్చినట్లు ఆ సంస్థ భారత్ ఏపీ డైరెక్టర్ అన్షుమన్ ప్రసాద్‌దాస్ పేర్కొన్నారు. జిల్లాకు గురువారం విచ్చేసిన ఆయన కలెక్టరేట్ సమీపంలోని మై భారత్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఇదివరకు జిల్లాలో చేపట్టిన కార్యక్రమాలు, పురోగతిపై ఆరా తీశారు. అనంతరం ఆర్‌ఎఫ్ రోడ్డులోని ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యాలయాన్ని సందర్శించి మై భారత్‌తో కలిసి చేపడుతున్న కార్యక్రమాల పట్ల అభినందించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టే పథకాలను అర్హులకు చేర్చడంలో జాతీయ యువ కార్యకర్తలు మైభారత్ ద్వారా చొరవ చూపాలని కార్యక్రమంలో మై భారత్ జిల్లా యువ అధికారి రాహుల్ గిర్రెడ్డి, ప్రోగ్రాం ఇన్‌చార్జి శ్రీనివాసులు, సాయి ట్రస్టు విజయసాయి, రాష్ట్రపతి అవార్డు గ్రహీత జయమారుతి, ఎస్ఆర్ ఎడ్యుకేషనల్ సొసైటీ కార్యదర్శి చాందిని, సభ్యులు దివ్యతేజ, శ్రీకాంత్, మహేంద్రధోని, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

మెప్మా సీఓలుగా వార్డు వెల్ఫేర్ సెక్రటరీలు

● ఉమ్మడి జిల్లాలో 43 మందికి డెప్యుటేషన్

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): గ్రామ-వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న వెల్ఫేర్ సెక్రటరీలను మెప్మాలో కమ్యూనిటీ ఆర్గనైజర్లుగా డెప్యుటేషన్‌పై పంపారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉన్న 12మున్సిపాలిటీలకు 43మంది వెల్ఫేర్ సెక్రటరీలను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ పురపాలక శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. అనంతపురం నగర పాలక సంస్థకు వార్డు వెల్ఫేర్ సెక్రటరీలు అనిల్‌కుమార్, నాగేంద్ర, రామకృష్ణ, రామాంజనేయులు, సుధాకర్, కిశోర్‌కుమార్‌లను కమ్యూనిటీ ఆర్గనైజర్లుగా డెప్యుటేషన్‌పై బదిలీ చేశారు. షరీఫ్‌ను గుత్తి మెప్మాకు కేటాయించారు. ప్రశాంత్‌ను తాడిపత్రి మెప్మాకు డెప్యుటేషన్‌పై బదిలీ చేశారు. రవి, ఇస్మాన్‌వలీ, రజియాసుల్తానా, నిర్మలాబాయిని గుంతకల్లుకు కేటాయించారు. రామచంద్ర, వి.రామకృష్ణ, బసవరాజు, కృష్ణమ్మ కళ్యాణదుర్గం మెప్మాకు, శివమూర్తి, సరిత, నాగరాజు, రాజేంద్రప్రసాద్, శ్రీనివాసులును రాయదుర్గం మెప్మాకు బదిలీ చేశారు.

శ్రీసత్యసాయి జిల్లాలో....

శ్రీలత, రాజశేఖర్‌ను పుట్టపర్తి మెప్మాకు కేటాయించారు. చిరంజీవి, మంజునాథ్, సిరాలా చంద్ర, ఆలాం వలీ, ప్రవీణ్‌కుమార్, చిన్న నరసింహులును హిందూపురం మున్సిపాలిటీ మెప్మా సీఓలుగా బదిలీ చేశారు. కదిరికి ఆంజనేయులు, రవికుమార్, వెంటరమణ, కృష్ణమూర్తి, హిమగిరి, శ్రీనివాసులును బదిలీ చేశారు. లావణ్య, జ్యోతి, కార్తిక్, భాగ్యలక్ష్మి, కృష్ణవేణి, బాలకృష్ణ, అరుణ, వలీబాషాను ధర్మవరం మున్సిపాలిటీలోని మెప్మా సీఓలుగా పంపారు. ఆయా మున్సిపాలిటీలకు కేటాయించిన వెల్ఫేర్ సెక్రటరీలు వెంటనే మెప్మా సీఓలుగా బాధ్యతలు స్వీకరించాలని ఉమ్మడి జిల్లా మెప్మా పీడీ విశ్వజ్యోతి తెలిపారు.

గురుకుల ప్రవేశాల కౌన్సెలింగ్ వాయిదా

అనంతపురం విద్య, జూన్ 26(ఆంధ్రజ్యోతి): సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ప్రవేశాల కౌన్సెలింగ్ వాయిదా పడినట్లు గురుకుల పాఠశాలల సమన్వయకర్త జయలక్ష్మి గురువారం ఓప్రకటనలో తెలిపారు. ఐదో తరగతికి మిగిలిన సీట్లకు ఈనెల 28న కౌన్సెలింగ్ నిర్వహించాలనుకున్నామని, అయితే రాష్ట్ర అధికారుల ఆదేశాల మేరకు వాయిదా వేసినట్లు తెలిపారు. ప్రవేశ పరీక్షలో సాధించిన మెరిట్ ఆధారంగా సీట్లు భర్తీ చేస్తామని, తల్లిదండ్రులు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు.

దివ్యాంగులశాఖ ఏడీగా అర్చన



ఏడీ అర్చనకు శుభాకాంక్షలు తెలుపుతున్న దివ్యాంగుల సంఘం నాయకులు

అనంతపురం విద్య, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లా దివ్యాంగులశాఖ అసిస్టెంట్ డైరెక్టర్(ఏడీ)గా అర్చన నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న ఏడీ వినోద్ చిత్తూరు జిల్లాకు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో ఒంగోలు నుంచి జిల్లాకు అర్చనను నియమించారు. ఆమె గురువారం బాధ్యతలు చేపట్టారు. నూతన ఏడీకి దివ్యాంగుల పోరాట సమితి నాయకులు హరినాథరెడ్డి, సుధాకర్, ఈశ్వర్, రామిరెడ్డి, కార్యాలయ సిబ్బంది కొత్త ఏడీకి శుభాకాంక్షలు తెలిపారు.

పనులను త్వరగా పూర్తి చేయండి: కలెక్టర్



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లా మినరల్ ఫండ్స్ కింద చేపట్టిన పనులను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో గురువారం జిల్లా మినరల్ ఫండ్స్‌కు సంబంధిం చిన మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ డిస్ట్రిక్ మినరల్ ఫండ్స్‌కు సంబంధించి 2024-25లో 116 పనులను గుర్తించామన్నారు. ఇందుకోసం రూ.11.72కోట్లు మంజూరైన ట్లు తెలిపారు. ఇప్పటివరకు 10 పనులు పూర్తి చేసినట్లు వెల్లడించారు. మిగిలిన పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. రూ.4కోట్లతో 27 పనుల కోసం ప్రతిపాదనలు వచ్చాయని, చెక్‌లిస్ట్ ప్రకారం పనులకు సంబంధించిన నివేదికలను ఆయా శాఖ అధికారులు అందజేయాల న్నారు. ఇతర ప్రాధాన్యతల కింద 61 పనులకు రూ.65కోట్లతో ప్రతిపాద నలు వచ్చినట్లు పేర్కొన్నారు. మినరల్ ఫండ్స్‌కు సంబంధించి కేంద్ర ప్రభుత్వం ప్రతి రూపాయి ఖర్చుని పరిశీలిస్తుందన్నారు. మంజూరైనా ఇంకా మొదలు పెట్టని పనులను క్షేత్రస్థాయిలో ఆయా శాఖల అధికారులు తనిఖీ చేయాలన్నారు. వారం రోజుల్లో తనిఖీ ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. సమావేశంలో మైన్స్ ఏజీ ఆదినారాయణ, డీపీఓ నాగరాజునాయుడు, డీటీడబ్ల్యుఓ రామాంజినేయులు, సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ, డీవీఈఓ వెంకటరమణ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

చీనీ టన్ను రూ.32వేలు

అనంతపురం రూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో గురువారం చీనీకాయలు టన్ను గైరంగాలు గరిష్టంగా రూ.32వేలు అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్టంగా రూ.15వేలు, సరాసరి రూ.20వేలకు విక్రయాలు జరిగాయన్నారు. సీజనల్ రకం కాయలు టన్ను గరిష్టంగా 18వేలు, కనిష్టంగా రూ.4వేలు, సరాసరి ధర రూ.13వేలు పలికినట్లు చెప్పారు.





ఆకులపై లద్దె పురుగు

← లద్దెపురుగు రంధ్రాలు చేసిన మొక్కలు, నంబులపూలకుంట వద్ద సాగుచేసిన వేరుశనగ పంట ↑



రెండుసార్లు మందులు పిచికారీ చేశా

నేను ఐదు ఎకరాల్లో బోరుకింద ముందస్తుగా వేరుశనగ పంట సాగుచేశా. రూ. లక్షా 20వేల వరకు ఖర్చువచ్చింది. ముందుగా సాగుచేస్తే మంచి దిగుబడి వస్తుందని, మార్కెట్‌లో మంచి ధరలు ఉంటాయని విత్తనం వేశా. పంట సాగు చేసి నెలన్నర దాటింది. లద్దెపురుగు రాత్రి సమయంలో ఆకులను తినేస్తోంది. పచ్చ పురుగు, రసం పీల్చే పురుగులు సోకాయి. ఇప్పటికే రెండుసార్లు మందులు పిచికారి చేశా. వారం రోజుల నుంచి ఎండ లేకపోవడంతో చీడపీడలను నివారించలేకపోతున్నాం.

- రాజగోపాల్‌రెడ్డి, రైతు, ఎర్రవంకలవారిపల్లి

ఆరంభంలోనే చీడపీడలు

● వేరుశనగను ఆశిస్తున్న లద్దెపురుగు ● మందులు పిచికారీ చేసినా అదుపులోకి రాని వైనం

నంబులపూలకుంట, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ముందుగా సాగు చేస్తే మంచి దిగుబడి వస్తుందని ఆశించిన వేరుశనగ రైతులను చీడపీడలు బెంబేలెత్తిస్తున్నాయి. నంబులపూలకుంట మండలంలో బోరుబావుల కింద పలువురు రైతులు తొలి వర్షాలకు వెయ్యి ఎకరాలకు పైగా వేరుశనగను సాగుచేశారు. విత్తనం వేసి నెలరోజులు దాటిపోవడంతో పూత దశకు చేరుకుంది. ఈ దశలో పంటకు లద్దె పురుగు ఆశించి ఆకులను తినేస్తోంది. రెండుసార్లు మందులు పిచికారి చేసినా పురుగును నివారించలేకపోతున్నామని రైతులు ఆందోళన చెందుతున్నారు. దీనికి తోడు పచ్చ పురుగు, రసం పీల్చే పురుగులు ఆశించడంతో రైతులకు దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. సూర్య రశ్మి సోకినప్పుడు లద్దె పురుగు బయటకు రాకుండా ఆకు కిందిభాగంలో గూళ్లు కట్టుకుని ఉంటుంది. రాత్రిసమయంలో ఆకులపైకి వచ్చి తినేస్తుంటుంది. చిగురును తింటే మొక్క ఎదుగుదల ఉండదు. మందులు పిచికారి చేస్తున్నా పదిరోజులుగా సూర్యకిరణాలు సోకకపోవడంతో పురుగులు ఉధృతంగా పెరుగుతున్నాయి. రబీ సీజన్‌లో బోరుబావుల కింద సాగు చేసి నష్టపోయిన రైతులు ఖరీఫ్‌లోనూ అదే పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఎకరా పంట సాగుకు ఇప్పటికే రూ.20వేల దాకా ఖర్చు చేశామని అంటున్నారు. మార్చిడితో దిగుబడి బాగా వస్తుందని ఇతర ప్రాంతాల నుంచి విత్తనాలు కొనుగోలు చేశారు. ధర బాగా ఉంటుందనే ఉద్దేశ్యంతో ట్యాక్-20 రకం విత్తనాలు వేశారు. కాయలు లావుగా, గింజలు నాణ్యంగా ఉండడంతో పచ్చికాయలకు ఎక్కువ డిమాండ్ ఉంటుంది. దీంతో చాలా మంది రైతులు వీటివైపు మొగ్గు చూపారు.

లద్దె పురుగులను నియంత్రించుకోవాలి

లద్దె పురుగు నివారణ చర్యలు తీసుకోకపోతే పంట మరింత నష్టపోయే ప్రమాదం ఉంటుంది. లద్దె పురుగుల నివారణకు పొలాల్లో విషపు ఎర్రలను తయారు చేసుకోవాలి. వరి తౌడు ఐదు కిలోలు, బెల్లం అర కిలో, క్లోరోపైరిపాస్ 500 ఎంఎల్ కలిపి ఉండలుగా తయారు చేసి, పొలంలో వేయాలి. లింగాకర్షక బుట్టలు పెట్టి, వాటిని గమనిస్తూ ఉండాలి. ఎకరాకు నాలుగు లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలి. పక్షి స్థావరాలను కూడా ఏర్పాటు చేస్తే లద్దె పురుగులను పక్షులు తినేస్తాయి. పచ్చపురుగులు, రసంపీల్చే పురుగులు ఉంటే థైయోడిక్ కార్బ్ 200 గ్రాముల 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేయాలి. లేదా ఫ్లూబెండమైడ్ 400 ఎంఎల్‌ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారి చేస్తే చీడపీడలను నివారించవచ్చు. పొలాలకు యూరియా ఎక్కువగా వేయడం వల్ల ఇలాంటి చీడపీడలు సోకుతున్నాయి.

- లోకేశ్వర్ రెడ్డి, వ్యవసాయ అధికారి

పూత దశలోనే చీడపీడలు



నేను రెండు ఎకరాల్లో ముందుగా వేరుశనగ సాగుచేశా. పంట సాగుకు రూ. 40వేలు ఖర్చు చేశా. పంట పూత దశలో ఉంది. ప్రస్తుతం చీడపీడల నుంచి పంటను కాపాడుకుంటే, పిందెలు అధికంగా వచ్చే అవకాశం ఉంటుంది. లద్దె పురుగుల నివారణకు ఇప్పటికే ఒకసారి మందు పిచికారి చేశా. మరోసారి పిచికారి చేద్దామంటే పదిరోజులుగా వాతావరణం అనుకూలించలేదు. చీడపీడలను నివారించకపోతే పంట ఏమాత్రం చేతికి వచ్చే అవకాశం లేదు.

- ప్రతాప్‌రెడ్డి, రైతు, తూర్పునడింపల్లి

తల నరికేశారు..!

మైదుగోళంలో వ్యక్తి దారుణ హత్య

వివాహేతర సంబంధమే కారణమని ప్రాథమిక నిర్ధారణ

పోలీసుల అదుపులో ఇద్దరు అనుమానితులు

లేపాక్షి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని మైదుగోళం గ్రామానికి చెందిన బోయ రవి కుమార్(37) దారుణ హత్యకు గురయ్యాడు. అతని తలను నరికేసి.. మొండెం నుంచి వేరు చేశారు. వివాహేతర సంబంధమే ఈ హత్యకు కారణమని పోలీసులు ప్రాథమికంగా నిర్ధారణకు వచ్చారు. హతుడి భార్య ఫిర్యాదు మేరకు ఇద్దరు అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

డిన్నర్ ఏర్పాటు చేసుకుని..

మైదుగోళం గ్రామానికి చెందిన రవికుమార్ వ్యవసాయంతోపాటు కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇదే గ్రామంలోని తన స్నేహితుడు ఆనంద్‌తో కలిసి మంగళవారం రాత్రి డిన్నర్ ఏర్పాటు చేసుకున్నాడు. గ్రామ సమీపంలోని కర్ణాటక ప్రాంతం నుంచి మద్యం, చికెన్ తెచ్చుకున్నారు. చికెన్ వండాలని తన భార్య గీతకు చెప్పి.. రవికుమార్ బయటకు వెళ్లిపోయాడు. గ్రామ సమీపంలోని నీటి గుంత వద్దకు ఆనంద్, రవికుమార్ వెళ్లి మద్యం సేవించి, తిరిగి ఇంటికి వచ్చారు. వండిన చికెన్‌ను తీసుకుని ఇద్దరూ కలిసి ద్విచక్రవాహనంలో బయటకు వెళ్లిపోయారు. ఆ తరువాత రవి కుమార్ ఇంటికి తిరిగి రాలేదు. దీంతో బుధవారం ఉదయం ఆనంద్‌ను గీత నిలదీసింది. తన భర్త ఎక్కడికి వెళ్లాడని ప్రశ్నిస్తే.. తెలియదని బుకాయించాడు. 'నీతోనే కదా కలిసి వెళ్లింది..? ఏమయ్యాడో తెలియదంటే ఎలా..? చెప్పకపోతే నీపై పోలీసులకు ఫిర్యాదు చేస్తా' అని గీత హెచ్చరించింది. దీంతో 'ఏమైనా చేసుకో.. నాకు సంబంధం లేదు' అని ఆనంద్ అక్కడి నుంచి వెళ్లిపోయాడు. రవి కుమార్ ఆచూకీ లభించకపోవడంతో లేపాక్షి పోలీస్ స్టేషన్‌లో అతని తండ్రి అశ్వర్థప్ప బుధవారం ఫిర్యాదు చేశారు. కుటుంబ సభ్యులు గ్రామ పొలిమేరల్లో గాలిస్తుండగా గురువారం ఉదయం రవి కుమార్ మృతదేహం కనిపించింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. రవి కుమార్ తల నరికి నీటి కుంటలో పడేసినట్లు గుర్తించారు. హత్య జరిగిన సమయంలో ఆనంద్‌తోపాటు మరొకరు అక్కడ ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. హతుడి భార్య ఇచ్చిన సమాచారం ఆధారంగా ఇద్దరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఆ ఇద్దరిలో ఒకరి భార్యతో రవికుమార్ సన్నిహితంగా ఉండేవాడని, వారి మధ్య వివాహేతర సంబంధం ఉందని పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ కారణంగానే రవి కుమార్‌ను హత్య చేశారని భావిస్తున్నారు. మృతదేహాన్ని హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రవి కుమార్ భార్య నుంచి ఫిర్యాదు స్వీకరించి, కేసు నమోదు చేశామని, దర్యాప్తు చేస్తున్నామని హిందూపురం రూరల్ సీఐ జనార్దన్ తెలిపారు. హత్యకు గురైన రవి కుమార్‌కు ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.



సంఘటనా స్థలంలో మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

డ్రగ్స్ అలవాటైతే నేరస్థులే..!

● మాదకద్రవ్యాల దుర్వినియోగంతో జీవితాలు నాశనం

● మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా దినంలో వక్తలు



మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రాజశేఖర్

అనంతపురం క్రైం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మాదక ద్రవ్యాలను అలవాటుగా ప్రారంభిస్తే.. తర్వాత నేరస్థులుగా మారే ప్రమాదం ఉందని పలువురు వక్తలు పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమరవాణా దినాన్ని పురస్కరించుకుని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖల ఆధ్వర్యంలో గురువారం ఎస్ఎస్‌బీఎన్ కళాశాలలో సమావేశం నిర్వహించారు. సమావేశానికి జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ కార్యదర్శి రాజశేఖర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అనంతపురం సూపరింటెండెంట్ రామ్మోహన్‌రెడ్డి ఇతర అధికారులు హాజరై మాట్లాడారు. ముందుగా న్యాయాధికారి రాజశేఖర్ మాట్లాడుతూ యువత సోషల్ మీడియా, సెల్‌ఫోన్లు, డ్రగ్స్ వంటి వాటితో చాలా అప్రమత్తంగా ఉండాలన్నారు. అనేక సర్వేల్లో దేశంలో 18 కోట్ల మందికిపైగా డ్రగ్స్ బాధితులున్నట్టు తేలిందన్నారు. యువత చదువుతోపాటు చట్టాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. తర్వాత చంద్రశేఖర్ మాట్లాడుతూ ఇంజనీరింగ్, డిగ్రీ ఇతర హయ్యర్‌కోర్సులు చదివే క్రమంలో యువత డ్రగ్స్ వైపు తప్పటడుగు వేస్తున్నారన్నారు. ముఖ్యంగా హోటళ్లు, బార్లలో బర్త్ డే పార్టీలకు వెళ్లినప్పుడు ఎక్కువగా ఈ అలవాట్లకు దగ్గర అవుతుంటారన్నారు. విద్యార్థులు వీటికి చాలా వరకూ దూరంగా ఉండాలని సూచించారు. మంచి భవిష్యత్తు ఉండాలంటే డ్రగ్స్‌కు దూరంగా జీవించాలని సూచించారు. రామ్మోహన్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు తమ గమ్యం, లక్ష్యాలను ముందే నిర్ణయించుకుని వాటి సాధనకు అడుగేయాలన్నారు. వ్యసనాలకు లోనుకాకుండా కష్టపడి చదవాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ శ్రీరామ్, ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ అన్నపూర్ణ, ఇతర ఇన్‌స్పెక్టర్లు జయనాథరెడ్డి, నాగసునీతారాణి, సబ్ ఇన్‌స్పెక్టర్లు జయనరసింహ, జాకీర్ హుస్సేన్, కృష్ణారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

బైక్‌పై వెళ్తున్న మహిళ గొలుసు చోరీ

శింగనమల, జూన్ 26(ఆంధ్రజ్యోతి): బైకు మీద వెళ్తున్న మహిళ నుంచి బంగారు గొలుసు లాక్కున్న సంఘటన గురువారం లోలూరు క్రాస్‌లో జరిగింది. శింగనమల ఎస్ఐ విజయ్‌కుమార్ బాధితులు రామాంజినమ్మ, జయచంద్రరెడ్డి తెలిపిన మేరకు గార్లదిన్నె గ్రామానికి చెందిన జయచంద్రరెడ్డి, రామాంజినమ్మ దంపతులు గురువారం ఉదయం ద్విచక్రవాహనంపై అనంతపురం వెళ్లారు. అక్కడ పని ముగించుకుని మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో తిరిగి గార్లదిన్నెకు బయల్దేరారు. లోలూరు క్రాస్ వద్దకు రాగానే అనంతపురం నుంచి ఒక యువకుడు ద్విచక్రవాహనంపై అతివేగంగా వచ్చి దంపతుల వాహనాన్ని సమీపించాడు. రెప్పపాటు కాలంలో మహిళ మెడలో వేసుకున్న మూడు తులాల బంగారు తాళిబొట్టు గొలుసును లాక్కొని అదే వేగంతో తిరిగి అనంతపురం వైపు వెళ్లిపోయాడు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

పత్తి తూకాల్లో మోసం

● రిమోట్‌తో మాయ చేసిన ఆదోని వ్యాపారులు

బొమ్మనహాళ్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా ఆదోనికి చెందిన పత్తి వ్యాపారులు తూకాల్లో మోసాలకు పాల్పడ్డారు. మండల పరిధిలోని క్రిష్ణాపురం గ్రామంలో మూడు రోజుల నుంచి పలువురు రైతుల వద్ద పత్తి కొనుగోలు చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం రిమోట్ సాయంతో కాటాను నియంత్రించి, తూకాలలో మోసానికి తెరలేపారు. తిప్పేస్వామి, వన్నూరుస్వామి, కొత్తపల్లి తిప్పయ్య, సుబ్బు తదితరుల నుంచి క్వింటం రూ.7,400 నుంచి రూ.7,800 వరకు ధరకు కొనుగోలు చేశారు. కాటా వేసే సమయంలో మొబైల్ ద్వారా రిమోట్‌ను వినియోగించి, మోసాలకు తెరలేపారు. రైతు తిప్పేస్వామికి అనుమానం వచ్చి పరిశీలించగా.. క్వింటానికి 20 కేజీలు ఎక్కువగా తీసుకున్నట్లు తేలింది. రైతులు ఆగ్రహించడంతో వ్యాపారులు పారిపోయారు. దళారులు జోక్యం చేసుకుని, గ్రామ పెద్దల వద్ద పంచాయితీ పెట్టారు. వారి జోక్యంతో 250 క్వింటాళ్లకు నగదు కట్టించేలా ఒప్పించారు. ఈ వ్యవహారంపై కొందరు గ్రామస్థులు బొమ్మనహాళ్ పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు గ్రామానికి చేరుకుని వివరాలు తెలుసుకున్నారు. వ్యాపారులు, రైతులు రాజీ కావడంతో మిన్నకుండిపోయారు. రైతుల నుంచి తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

వైద్యులే పరిపాలనాధికారులు

● డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి

అనంతపురం వైద్యం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ప్రాథమిక వైద్య కేంద్రం(పీహెచ్‌సీ)లోని వైద్యులే ఆ కేంద్ర పరిధిలో పరిపాలనా అధికారులని డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి పేర్కొన్నారు. డీఎంహెచ్ఓ కార్యాలయంలో ఇంటిగ్రేటెడ్ హై రిస్క్ ప్రెగ్నెన్సీ మేనేజ్మెంట్ ప్రోటోకాల్స్ అనే అంశంపై పీహెచ్‌సీ డాక్టర్లకు నిర్వహించిన నాలుగు రోజుల శిక్షణా కార్యక్రమం గురువారం ముగిసింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డీఎంహెచ్ఓ మాట్లాడారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలు వైద్యసేవల కోసం పీహెచ్‌సీకి వస్తారన్నారు. వారికి అవసరమైన వైద్య చికిత్సలు అందించడం డాక్టర్ల బాధ్యతన్నారు. మీ పరిధిలోని వైద్యశాఖ అధికారులు, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ ప్రభుత్వం నిర్దేశించి న లక్ష్యాలను ఎప్పటికప్పుడు పూర్తిచేయాలని సూచించారు. పీహెచ్‌సీ డాక్టర్లు కేవలం వైద్యసేవలందించడమే కాదని పరిపాలనలో భాగస్వా ములని గుర్తుపెట్టుకోవాలన్నారు. ఆర్బీఎస్కే బాలల ఆరోగ్య స్క్రీనింగ్‌లో భాగంగా చిన్నారులకు పట్టుకతో వచ్చే శారీరక, మానసిక లోపాలను త్వరతగతిన గుర్తించి వైద్యసేవలందించాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు యుగంధర్, నారాయణస్వామి, డాక్టర్ జగదీష్ నాయక్, డీఈఐసీ మేనేజర్ రజిత తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు జరగకూడదు

● కలెక్టర్ వినోద్‌కుమార్



అనంతపురం కలెక్టరేట్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో బాల్య వివాహాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని కలెక్టర్ వినోద్‌కుమార్ అన్నారు. కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో జిల్లా స్థాయి కౌమార బాలికల సాధికారత, బాల్యవివాహాల నిషేధంపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు సంబంధించి అధికారులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. బాల్య వివాహాలతో కలిగే నష్టాలపై పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన కల్పించాలన్నారు. ఎక్కడైనా వివాహాలు జరిపిస్తే కేసులు నమోదు చేయాలన్నారు. సబ్‌రిజిస్ట్రార్ ఆఫీసుల్లో మ్యారేజ్ రిజిస్ట్రేషన్ కోసం ఏఏ డాక్యుమెంట్లు తీసుకుంటున్నారో డెకాయ్ ఆపరేషన్ చేసి పరిశీలిస్తామన్నారు. ఇప్పటివరకు అమ్మాయిల మిస్సింగ్‌పై ఎన్ని కేసులున్నాయో జాబితా తయారు చేసి, టైం పీరియడ్ లోపు ఎస్‌హెచ్ఓలు డాక్యుమెంటేషన్ తయారు చేయాలన్నారు. సమావేశంలో ఐసీడీఎస్ పీడీ నాగమణి, జెడ్పీ సీఈఓ శివశంకర్, డీఎస్పీ మహబూబ్‌బాషా, సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ పాల్గొన్నారు.

సమగ్రశిక్షలో పర్యవేక్షణ గాలికి..!

(5వ పేజీ తరువాయి)

మధ్యాహ్న భోజనం, బుద్ధిమాంద్యత పిల్లలకు ప్రత్యేక బడులు, వైద్యసేవలు, ఆడపిల్లల ఉన్నత చదువుల కోసం కేజీబీవీలు, కరువు, ఇతర కారణాలతో బడులుకు రాని పిల్లలకు ప్రత్యేక బడులు, వసతులు కల్పిస్తున్నారు. పాఠశాలల మరమ్మతులు, కొత్తభవనాలు, ల్యాబ్‌లు, మైదానాలు వంటి వాటికి నిధులు విడుదల అవుతున్నాయి.

కొరవడిన పర్యవేక్షణ

ఎస్ఎస్ఏ శాఖ సెక్టోరల్స్ అసిస్టెంట్ సెక్టోరల్స్ ఇతర సిబ్బందితో కలకలలాడుతూ ఉండేది. ఉదయం కార్యాలయానికి రాకనే జిల్లాలోని వివిధ పాఠశాలల తనిఖీలకు వెళ్లి పథకాలు అమలు, నిధుల ఖర్చు, విద్యాప్రమాణాలను పరిశీలించేవారు. ప్రస్తుతం ఎస్ఎస్ఏలో నిర్మానుష్యం కనిపిస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత ఏడాది జూలై నెలలో ఇక్కడ ఉన్న సెక్టోరల్ ఆఫీసర్లను రిలీవ్ చేసి సొంత శాఖకు పంపించారు. అప్పటి నుంచి కొత్తసెక్టోరల్స్‌ను నియమించుకోలేదు. దీంతో ఏడాది నుంచి పాఠశాలలో విద్యాపథకాలను పరిశీలించేవారు, అడిగేవారే కరువయ్యారు. ఎస్ఎస్ఏ ఈ పరిస్థితికి ఆ శాఖకు చెందిన ఇద్దరు అధికారులకు పెత్తనం ఇవ్వడం కూడా కారణమన్న విమర్శలు ఆ శాఖలో వినిపిస్తున్నాయి. గతంలో ఎస్ఎస్ఏకు ప్రాజెక్టు ఆఫీసర్(పీఓ) ఒక్కరే ఉండేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇద్దరు అధికారులను నియమించారు. పీఓ స్థానంలో ఏపీసీ (అసిస్టెంట్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్)ని ఏర్పాటు చేశారు. ఏపీసీ కన్నా పైఅధికారిగా డీఈఓకు డీపీసీ(డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్)గా అధికారం అప్పగించారు. ఏపీసీ ఏమి చేయాలన్నా డీపీసీకి ఫైల్‌పెట్టి వారి ఆమోదం తీసుకున్న తర్వాతనే ముందుకు వెళ్లాల్సి ఉంటుంది. దీంతో ఇద్దరి మధ్య ఆధిపత్య పోరు సాగుతూ విద్యావ్యవస్థలు దెబ్బతింటున్నాయి.

పర్యవేక్షణపై ప్రత్యేక దృష్టి



విద్యా పథకాల అమలు, పాఠశాలల పనితీరుపై ప్రత్యేక దృష్టి పెడతాం. ఇప్పటి వరకు ఉపాధ్యాయుల బదిలీలు ఉండడంతో పర్యవేక్షణ చేయలేకపోయాం. ఆ ప్రక్రియ ముగిసింది. ఇక పాఠశాలల తనిఖీలకు ప్రాధాన్యం ఇస్తాం. ఇచ్చిన నిధులు నిబంధనల మేరకే ఖర్చుపెట్టాల్సి ఉంటుంది. అందుకు విరుద్ధంగా వినియోగించినట్లు తేలితే చర్యలు తప్పవు. - ప్రసాద్‌బాబు, డీపీసీ, ఎస్ఎస్ఏ

సెక్టోరల్స్ నియామకాలకు నోటిఫికేషన్ ఇచ్చాం



ఎస్ఎస్ఏలో పథకాలు సక్రమంగా అమలు కావాలంటే సెక్టోరల్స్ చాలా అవసరం. వివిధ కారణాల వల్ల నేను రాక మునుపటి నుంచి ఇక్కడ సెక్టోరల్స్ నియామకాలు జరగలేదు. ఇపుడు నియామకాలకు నోటిఫికేషన్ ఇచ్చాం. ఎంపిక ప్రక్రియను త్వరగా పూర్తిచేస్తాం. తర్వాత పాఠశాలలు, విద్యాపథకాల అమలుకే ప్రాధాన్యం ఇస్తాం.

- శైలజ, ఏపీసీ, ఎస్ఎస్ఏ

కర్ణాటక వాసి ఆత్మహత్య

గుంతకల్లు టౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వేస్టేషన్ పార్శిల్ కార్యాలయం ఎదురుగా రాయచూరు జిల్లా లింగసూగూరుకు చెందిన వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గురువారం వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు సమీపంలోని పార్కులో ఓ చెట్టుకు శరణప్ప(39)అనే వ్యక్తి ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతను బేల్దారి పనిచేసుకుని జీవనం సాగించేవాడు. మూడు రోజుల క్రితం తిరుపతికి వెళ్తునట్లు ఇంట్లో చెప్పి బయల్దేరాడు. అయితే గురువారం ఆత్మహత్యకు పాల్పడడంతో కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరయ్యారు. మృతుడికి భార్య శ్రీదేవి, ముగ్గురు పిల్లలు ఉన్నారు. మృతికి గల కారణాలు విచారణలో తెలియాల్సి ఉంది. మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వద్దనుకున్నారా... వదిలేశారా?

● నాలుగు రోజులుగా బ్యాంకు వద్ద ద్విచక్రవాహనం


వదిలి వెళ్లిన ద్విచక్రవాహనం

విడపనకల్లు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): స్థానిక కెనరా బ్యాంక్ వద్ద గుర్తు తెలియని ద్విచక్రవాహనం నాలుగు రోజులుగా ఉంది. దీన్ని గమనించిన స్థానికులు విడపనకల్లు పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ ఖాజాహుస్సేన్ ద్విచక్రవాహనాన్ని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ ద్విచక్రవాహనం నంబరు(ఏపీ 02కే 2940) ఆధారంగా పరిశీలించగా గార్లదిన్నె మండలం కొప్పలకొండ గ్రామానికి చెందిన కే రామన్న అనే వ్యక్తి పేరున రిజిస్టర్ అయి ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. వాహన యజమానులు రికార్డులతో విడపనకల్లు పోలీస్ స్టేషన్‌కు రావాలని ఎస్ తెలిపారు.

ఆత్మహత్యకు యత్నించిన మహిళ మృతి

బొమ్మనహాళ్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఆత్మహత్యకు యత్నించిన పూజ(19) చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. బొమ్మనహాళ్ పోలీసులు తెలిపిన మేరకు బళ్లారికి చెందిన జ్యోతి, సన్న ఈరప్ప దంపతుల కుమార్తె పూజ(19)ను కుడితినికి చెందిన రాజేష్‌కు ఇచ్చి ఆరునెలల కిందట వివాహం చేశారు. వీరు కొంతకాలం నుంచి మండల కేంద్రంలోని దాసరి రామ్మూర్తి అనే వ్యక్తి ఇంట్లో అద్దెకు ఉంటూ పాత్ర వస్తువులు వ్యాపారం చేసుకుంటూ జీవించేవారు. ఏం జరిగిందో తెలియదు కాని ఈ నెల 19న రాత్రి దోమల నివారణకు ఉపయోగించే ద్రావకాన్ని తాగి పూజ ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన కుటుంబసభ్యులు బళ్లారి విమ్స్‌కు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందినట్లు చెప్పారు. మృతురాలు గతంలో మూర్ఛవ్యాధితో మతిస్థిమితం కోల్పోయి ప్రవర్తిస్తుండేదని మృతురాలి తల్లి జ్యోతి ఫిర్యాదులో పేర్కొన్నట్లు తెలిపారు. శవానికి పోస్టుమార్టం నిర్వహించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

కర్ణాటకలో తూమకుంట యువకుడి హత్య


రవికుమార్ (ఫైల్)

హిందూపురం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కర్ణాటకలోని కుడుమలకుంట సమీపంలో గురువారం సాయంత్రం హిందూపురం మండలం తూమకుంటకు చెందిన రవికుమార్(35) హత్యకు గురయ్యాడు. తూమకుంటకు చెందిన ఉప్పర రవికుమార్ పారిశ్రామికవాడలోని ఓ పరిశ్రమలో వెల్డర్‌గా పనిచేస్తున్నాడు. ఇతడికి భార్య, ఇద్దరు పిల్లలున్నారు. కానీ కొంతకాలంగా వారికి దూరంగా ఉంటున్నారు. ఈ నేపథ్యంలో గురువారం సాయంత్రం సరిహద్దులోని బార్ వద్ద మద్యం సేవించి ఓ వ్యక్తితో గొడవ పడ్డాడు. ఈ గొడవలో రవికుమార్‌ను మద్యం బాటిల్‌తో పొడిచి హత్య చేశారు. గౌరీబిదనూరు పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు గౌరీబిదనూరు రూరల్ పోలీసులు తెలిపారు. కాగా రవికుమార్‌ను హత్యచేసిన నిందితున్ని తొండేబావి వద్ద పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

వారిని తీసేయండి

● అధికారులపై అధికార పార్టీ నాయకుల ఒత్తిడి

యల్లనూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలో గత ప్రభుత్వం నుంచి ఫీల్డ్ అసిస్టెంట్, రేషన్‌షాపు డీలర్లుగా కొనసాగుతున్న వారిని తొలగించాలని అధికారులపై ఒత్తిడి ఎక్కువైనట్లు తెలుస్తోంది. సాధారణ బదిలీల్లో భాగంగా వచ్చిన అధికారులు సీట్లో కూర్చొని పదిరోజులు కాకముందే అధికార పార్టీ నాయకుల నుంచి ఒత్తిడి వస్తుండటంలో వారు తలలు పట్టుకుంటున్నారు. మండలంలోని నాలుగైదు పంచాయతీల్లో రేషన్‌షాపులు నేటికి వైసీపీ వారే నిర్వహిస్తున్నారు. ఫీల్డ్ అసిస్టెంట్లు కూడా కొన్నిచోట్ల పాతవారే కొనసాగుతున్నారు. ఇప్పటికి ఆయా పంచాయతీల్లో వైసీపీ నాయకుల పెత్తనం ఉండడంతో టీడీపీ నాయకులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇలాంటి వారిని వెంటనే మార్చాలని టీడీపీ నాయకులు అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం.

ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర స్థాయి ఫెన్సింగ్ పోటీలకు జిల్లా క్రీడాకారులను గురువారం ఎంపిక చేశారు. స్థానిక కొవ్వూర్‌నగర్‌లోని విద్యారణ్య స్కూల్‌లో జిల్లా స్థాయి ఫెన్సింగ్ క్రీడాకారుల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన క్రీడాకారుల వివరాలను జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు మురళీకృష్ణ, పుష్పావతి తెలిపారు. అండర్-10 బాలురలో గౌతమ్‌కృష్ణ, హరియాన్, సాద్విన్, మోహన్‌కృష్ణ ఎంపిక కాగా బాలికల విభాగంలో అన్వి, అశ్విత, చైత్ర చోటు సాధించారు. అండర్-12 బాలురలో ఫణికుమార్, జశ్విత్‌రెడ్డి, జావీద్, నరేందర్, దుర్గా, బాబాఫకృద్దీన్ ఎంపిక కాగా, బాలికల విభాగంలో ముక్త, లిఖితబాయి, దీక్ష, హిమబిందులు ఎంపికైన వారిలో ఉన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 29 నుంచి విజయవాడలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు.


ఎంపికైన ఫెన్సింగ్ క్రీడాకారులు

సిఫార్సు లేఖలతో తలనొప్పి

● ఇంజనీరింగ్ అసిస్టెంట్ల బదిలీలకు కుప్పలు తెప్పలుగా సిఫార్సు లేఖలు

● తలలు పట్టుకుంటున్న యంత్రాంగం


పీఆర్ ఎస్ఈ కార్యాలయం (ఫైల్)

అనంతపురం న్యూటౌన్ జూన్ 26(ఆంధ్రజ్యోతి): బదిలీలకు సంబంధించి సిఫార్సు లేఖలు ఉన్నతాధికారులకు తలనొప్పిగా మారాయి. సచివాలయ సిబ్బంది బదిలీలకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చి ఒకే చోట ఐదేళ్లు పూర్తి చేసుకున్నవారికి బదిలీ తప్పనిసరి చేసింది. దీంతో కొందరు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు తమకు అనుకూలమైన స్థానాల మీద కన్నేశారు. దాన్ని దక్కించుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేసినట్లు సమాచారం. అధికార పార్టీ నాయకుల సిఫార్సు లేఖలను బదిలీ దరఖాస్తుకు జత చేసి ఉన్నతాధికారులకు ఇస్తున్నారు. కుప్పలు తెప్పలుగా వచ్చి పడుతున్న ఈ సిఫార్సు లేఖలే అధికారులకు తలనొప్పిగా మారాయి. ఇప్పటికే ఉన్న స్థానాలు రేషలైజేషన్‌లో భాగంగా తగ్గిపోయాయి. సిఫార్సులకు ప్రాధాన్యం ఇచ్చి కొత్తవారిని తెచ్చుకుంటే వారితో పని చేయించుకోవడం కష్టమని అధికారులు భావిస్తున్నారు. పైగా బదిలీలకు సంబంధించి ఇంజనీరింగ్ అసిస్టెంట్‌కు అసలు ప్రక్రియే ప్రారంభం కాకపోవడంతో అసలు బదిలీలు జరుగుతాయా? లేదా అన్న అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి.

తగ్గిన 300 పోస్టులు

అనంతపురం జిల్లాకు ఇంజనీరింగ్ అసిస్టెంట్ల పోస్టులు 483 ఉన్నాయి. ఇందులో 429 మంది పని చేస్తున్నారు. 54 ఖాళీలు ఉన్నట్లు అధికారులు రికార్డులు తయారు చేశారు. శ్రీసత్యసాయి జిల్లాలో 420 పోస్టులు ఉండగా 334 మంది పని చేస్తున్నారు. 85 ఖాళీలు ఉన్నట్లు అధికారులు రికార్డులు తయారు చేశారు. ఉమ్మడి జిల్లాకు సంబంధించి రేషనలైజేషన్‌లో 300 పోస్టులు దాక తగ్గిపోయాయి. దీంతో ఆ స్థానాల్లో ప్రస్తుతానికి ఇంజనీరింగ్ అసిస్టెంట్స్ ఉన్నా ప్రస్తుత బదిలీల్లో అక్కడ పోస్టులు లేనట్లు చూపిస్తున్నారు. దీంతో మొదటిగా రేషనలైజేషన్‌కు అనుగుణంగా సర్దుబాటు చేసి బదిలీలు చేపట్టాలని సిబ్బంది రాష్ట్ర స్థాయి అధికారుల వద్ద నిరసన తెలుపుతున్నారు. దీంతో పాటు పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి వీటిని పరిష్కరించిన తరువాత బదిలీల ప్రక్రియ చేపట్టాలని డిమాండ్ చేస్తున్నారు. ఉన్నతాధికారులు మాత్రం వీటిని పట్టించుకోకుండా వారి పని వారు చేసుకుపోతున్నారు.

నకిలీ బంగారంతో రుణం.. గుట్టు రట్టు

ముగ్గురు నిందితుల అరెస్ట్

నార్పల ప్రైవేట్ బ్యాంకులో మూడు దఫాలుగా తాకట్టు

రూ.9 లక్షలు పైబడి రుణం పొందిన దుండగులు

నార్పల, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఓ ప్రైవేట్ బ్యాంక్‌లో నకిలీ బంగారం ఆభరణాలు పెట్టి రుణం తీసుకొని మోసం చేసిన కేసులో ముగ్గులు నిందితులను నార్పల పోలీసులు అరెస్ట్ చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అరెస్ట్ వివరాలను సీఐ కౌలుట్లయ్య వెల్లడించారు. నార్పలకు చెందిన మహమ్మద్ ఇమ్రాన్, యల్లనూరు దాదాపీర్, మహమ్మద్ రఫీలు కలిసి ఇమ్రాన్ పేరు మీద ప్రైవేట్ బ్యాంకులో ఖాతా ప్రారంభించారు. తొలిసారి నాలుగు నకిలీ బంగారు గాజులుపెట్టి రూ. 3,21,693లు, రెండోసారి రెండు నకిలీ బంగారు కడియాలు పెట్టి రూ.3,53,174లు, మూడోసారి మూడు నకిలీ బంగారు గాజులు పెట్టి రుణం తీసుకున్నారు. ఇలా మొత్తం రూ. 9,46,890లు రుణం తీసుకున్నారు. ఈనెల 23న బ్యాంకు గోల్డ్ లోన్ క్లస్టర్ మేనేజర్ కొలంట్ల నాగరాజు ఆడిటింగ్ నిర్వహించారు. ఆ సమయంలో మొత్తం 125.8 గ్రాములు నకిలీ బంగారాన్ని గుర్తించారు. దాని మీద రూ.9,46,890లు లోన్ తీసుకున్నట్లు గుర్తించి నార్పల పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈక్రమంలోనే ముగ్గురు నిందితులు మరోసారి నేరం చేసేందుకు ప్రయత్నించగా నార్పల ఎస్ఐ సాగర్, సిబ్బంది గురువారం వారిని అరెస్ట్ చేసి, వారి నుంచి పది బంగారు నకిలీ గాజులు, రెండు బంగారు కడియాలు, మూడు నకిలీ బంగారు ఉంగరాలు, ఒక ద్విచక్రవాహనం, కారును స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురితో పాటు మరో ఆరుగురు నేరం చేసినట్లు తమ దర్యాప్తులో వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు.

లక్కు ఎవరికో..!

అనంత ఏడీఏ పోస్టుపై సందిగ్ధత

అనంతపురం అర్బన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): అనంతపురం ఏడీఏ పోస్టు భర్తీపై సందిగ్ధత వీడలేదు. పక్షం రోజుల నిరీక్షణ తర్వాత బుధవారం రాత్రి ఆలస్యంగా ఏడీఏ బదిలీల రెండో జాబితాను విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలో ఏడుగురు ఏడీఏలకు తొలి జాబితాలో కేటాయించిన స్థానాలే ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే అనంతపురం, హిందూపురం ఏడీఏ స్థానాలను పెండింగ్‌లో పెట్టారు. తొలి జాబితాలో హిందూపురం ఏడీఏ అల్తాఫ్ అలీఖాన్‌ను అనంతపురం ఏడీఏగా, ధర్మవరం ఏడీఏ కృష్ణయ్యను హిందూపురం ఏడీఏగా నియమించారు. అయితే రెండో జాబితాలో అనంతపురం, హిందూపురం ఏడీఏ స్థానాలు ఖరారు చేయకపోవడం తీవ్ర చర్చకు దారితీసింది. తొలి జాబితాలోని కొన్ని స్థానాలు మార్పు చేసిన నేపథ్యంలో సీఎం చంద్రబాబు అనుమతి కోసం సీఎం కార్యాలయానికి ఫైల్ పంపినట్లు సమాచారం. ఈ నేపథ్యంలో అనంత ఏడీఏ పోస్టు ఎవరికి దక్కుతుందోనన్న ఉత్కంఠ ఆ శాఖ వర్గాల్లో నెలకొంది.

ఏడుగురికి తొలి జాబితాలోని స్థానాలే ఖరారు

ఉమ్మడి జిల్లాలో ఏడుగురు ఏడీఏలకు తొలి జాబితాలోని స్థానాలే ఖరారు చేశారు. అనంతపురం ఏడీఏ రవిని తాడిపత్రికి బదిలీ చేశారు. కదిరి ఏడీఏ సత్యనారాయణను ఉరవకొండకు, తాడిపత్రి ఏడీఏ చెంగల్‌రాయుడును కర్నూలు జిల్లా ఆలూరుకు, మడకశిర ఏడీఏ కృష్ణమీనన్‌ను పెనుకొండకు, శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తి జిల్లా రైతు శిక్షణా కేంద్రం ఏడీఏ సనావుల్లాను కదిరికి, రాయదుర్గం ఏడీఏ లక్ష్మానాయక్‌ను ధర్మవరం, ఉరవకొండ ఏడీఏ పద్మాజను రాయదుర్గం ఏడీఏగా బదిలీ చేశారు. దీంతో వారు పాత స్థానాల్లో రిలీవ్ అయ్యారు. ఒకటి, రెండు రోజుల్లో కొత్త స్థానాల్లో బాధ్యతలు స్వీకరించనున్నట్లు సమాచారం.

అయిష్టంగా.. ఆవేదనతో..!

దూరప్రాంతాలను కోరుకున్న టీచర్లు

ముగిసిన 1998 ఎంటీఎస్ టీచర్ల కౌన్సెలింగ్

అనంతపురం విద్య, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఆందోళనను ఎక్కువ కాలం కొనసాగించలేక దూరప్రాంతాలను అయిష్టంగానే ఆవేదనతో 1998 ఎంటీఎస్ టీచర్లు తీసుకున్నారు. విద్యాశాఖాధికారులు పట్టుదలగా తాము అనుకున్నట్లుగానే ఖాళీలు చూపించి గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎంటీఎస్ టీచర్లలో చీలికరావడం, 2008 ఎంటీఎస్ టీచర్లు బుధవారం కౌన్సెలింగ్‌కు హాజరుకావడంతో విద్యాశాఖ యంత్రాంగం పట్టుబిగించింది. ఈ నేపథ్యంలోనే మిగిలిన 1998ఎంటీఎస్ టీచర్లను గురువారం కౌన్సెలింగ్‌కు రావాలని విద్యాశాఖ ఆహ్వానించింది. దీంతో వారు మధ్యాహ్నం జిల్లా సైన్స్‌సెంటర్‌కు చేరుకున్నారు. తొలుత అక్కడ సమావేశమై కౌన్సెలింగ్‌కు హాజరవుదామా., వద్దా అని చర్చించుకున్నారు. అయితే చాలామంది తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తూ 'రోజూ ఇక్కడికి రావడం..వెళ్లడం ఏంటి? మనం కౌన్సెలింగ్‌కు పోదాం. పాఠశాలలు కోరుకుందా. ఇష్టమైతే వెళ్దాం. లేదంటే సెలవు పెడదాం. అదికూడా కాకుంటే వదిలేద్దాం' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అయిష్టతతోనే కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. డీఈఓ ప్రసాద్‌బాబు, ఏఎస్‌ఓ శ్రీనివాసులు కౌన్సెలింగ్‌కు హాజరైన ఎంటీఎస్ టీచర్లకు ఖాళీలు చూపిస్తూ వారుకోరుకున్న స్కూల్స్‌ను కేటాయించారు. 1998ఎంటీఎస్ టీచర్లు 394మంది హాజరయ్యారు. వీరందరూ దూరప్రాంతాలను అయిష్టంగానే ఆవేదనతో కోరుకున్నారు.

నకిలీ గుడ్‌నైట్..!

ఏరియల్, టైడ్ కూడా..!

విజిలెన్స్ తనిఖీలో బట్టబయలు


గుంతకల్లులోని అంబికా జనరల్ స్టోర్స్‌లో తనిఖీ చేస్తున్న అధికారులు

అనంతపురం క్రైం/గుంతకల్లు టౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు ప్రాంతాలలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్, ఇతర శాఖల అధికారులు దాడులు నిర్వహించారు. అనంతపురం, గుంతకల్లులోని పలు దుకాణాలలో తనిఖీలు నిర్వహించారు. దోమల నియంత్రణకు వినియోగించే గుడ్‌నైట్ లిక్విడ్ నకిలీ ఉత్పత్తులను అమ్ముతున్నారని హిందూస్తాన్ యూనిలివర్ లిమిటెడ్ సంస్థ ఇచ్చిన ఫిర్యాదుపై అధికారులు స్పందించి, ఈ దాడులు చేశారు. అనంతపురంలోని రాజారాం కిరాణం దుకాణం, సోమేశ్వర్ ట్రేడర్స్, లక్ష్మీ జనరల్ స్టోర్స్, గుంతకల్లులోని అంబికా జనరల్ స్టోర్స్, రాజ్యలక్ష్మి జనరల్ స్టోర్స్, మహాదేవ్ జనరల్ స్టోర్స్, భవాని జనరల్ స్టోర్స్, అరతి జనరల్ స్టోర్స్‌లో తనిఖీలు చేశారు. నకిలీ గుడ్ నైట్ మస్కిటో లిక్విడ్, ఏరియల్, టైడ్ డిటర్జెంట్ పౌడర్ ప్యాకెట్లను పలు దుకాణాలలో గుర్తించారు. రూ.1.41 లక్షల విలువైన నకిలీ ఉత్పత్తులను సీజ్ చేశారు. గుంతకల్లులో గుడ్‌నైట్ లిక్విడ్ డూప్లికేట్ ఉత్పత్తులను విక్రయిస్తున్నారని గొద్రెజ్ కంపెనీ నిర్వాహకులు తమకు ఫిర్యాదు చేశారని విజిలెన్స్ సీఐ శ్రీనివాసులు తెలిపారు. పట్టణంలోని ఐదు జనరల్ స్టోర్స్‌లో తనిఖీలు చేశామని, రూ.97,675 విలువ చేసే నకిలీ గుడ్‌నైట్ లిక్విడ్‌కు సంబంధించిన 926 బాక్సులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నకిలీ సరుకు ఈ దుకాణాలకు ఎక్కడి నుంచి సరఫరా అయ్యిందో విచారిస్తున్నామని తెలిపారు. దాడుల్లో డిప్యూటీ ఎస్పీ నాగభూషణం, సీఐలు శ్రీనివాస్, జమాల్ బాషా, ఏవో వాసుప్రకాష్, ఏఈఈ రవీంద్రనాథ్, డీసీటీఓ సురేష్, గుంతకల్లు తూనికల కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్ శంకర్, విజిలెన్స్ ఎస్ఐ వెంకటప్రసాద్, డిప్యూటీ ఏసీ హుస్సేన్ పీరా, తూనికలు కొలతల శాఖ ఇన్‌స్పెక్టర్లు శంకర్, ఖాజాహుస్సేన్, జీఎస్టీ శాఖ శాఖ నుంచి విజయలక్ష్మి పాల్గొన్నారు.

గంజాయిని రాష్ట్రానికి పరిచయం చేసింది వైసీపీనే

● బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత

పెనుకొండ టౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా డ్రగ్స్, గంజాయిని పరిచయం చేసిన పార్టీ వైసీపీ అని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత విమర్శించారు. పెనుకొండలో అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమరవాణా వ్యతిరేక దినాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి సవిత మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో గంజాయి విరివిగా ఉండేదని, ప్రస్తుతం తమ ప్రభుత్వం దాన్ని నామరూపాలులేకుండా చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ మంత్రి నారాలోకేశ్ తీసుకున్న చర్యలవల్ల గంజాయిని పూర్తిగా నిర్మూలించామన్నారు. డ్రగ్స్ వాడితే కుటుంబాలు ఏవిధంగా చిన్నాభిన్నం అవుతాయో ప్రజలకు అవగాహన కల్పించామన్నారు. యువత మత్తుపదార్థాల జోలికి వెళ్లకుండా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ నరసింగప్ప, కమిషనర్ సతీష్‌కుమార్, తహసీల్దార్ సురేష్, ఎక్సైజ్ సీఐ సృజన్‌బాబు, నాయకులు, కార్యకర్తలు, విద్యార్థులు పాల్గొన్నారు.


ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులతో మంత్రి సవిత

భూసేకరణపై గ్రామ సభలు: కలెక్టర్


భూసేకరణపై అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి టౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోలార్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు చేపట్టిన భూ సేకరణలపై ఆయా గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించాలని కలెక్టర్ చేతన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోలార్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుపై సంబంధితాధికారులతో కలెక్టర్ గురువారం సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాల్లో పలు ప్రాంతల్లో సోలార్ పవర్ ప్రాజెక్టుల ఏర్పాటుకు భూసేకరణ చేయాలని అందుకు సంబంధించి ఆయా గ్రామాల్లో ప్రజల అభిప్రాయాలు సేకరించి, సమగ్ర నివేదికను సమర్పించాలన్నారు. సమావేశం లో రెవెన్యూ అధికారులు, నెట్ క్యాప్ అధికారులు, సోలాప్ పవర్‌పాయింట్ ప్రతినిధులున్నారు.

మత్తుపై కఠిన చర్యలు: డీఐజీ

అనంతపురం క్రైం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): గంజాయి, ఇతర నిషేధిత మత్తు పదార్థాలను సాగు చేసినా, వినియోగించినా, అక్రమ రవాణా చేసినా కఠిన చర్యలు తీసుకుంటామని అనంతపురం రేంజ్ డీఐజీ డాక్టర్ షిమోషీ హెచ్చరించారు. మత్తు పదార్థాల నియంత్రణ విషయంలో రాజీ పడబోమని, జిల్లా నుంచి బహిష్కరిస్తామని అన్నారు. మత్తు పదార్థాల వాడకం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం దెబ్బతింటుందని అన్నారు. గంజాయి, డ్రగ్స్ వాడకం వల్ల విచక్షణ కోల్పోయి, నేరాలకు పాల్పడే ప్రమాదం ఉందని అన్నారు. కుటుంబాలు దెబ్బతింటాయని, పిల్లలు భవిష్యత్తు కోల్పోతారని హెచ్చరించారు. మత్తు పదార్థాల నియంత్రణకు ఈగల్ టీమ్స్, ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలు నిరంతరం పనిచేస్తున్నాయని అన్నారు. పిల్లలు డ్రగ్స్ బారిన పడకుండా తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

జాతీయ కబడ్డీ పోటీలకు ఇద్దరి ఎంపిక


హిమజ, సజీద

అనంతపురం క్లాక్‌టవర్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జాతీయ కబడ్డీ పోటీలకు ఇద్దరు జిల్లా క్రీడాకారిణులు ఎంపికయ్యారు. ఈనెల 28 నుంచి ఉత్తరాఖండ్ రాష్ట్రంలోని హరిద్వార్‌లో కబడ్డీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే అండర్-18 జాతీయ బాలికల కబడ్డీ పోటీలకు ఏపీ రాష్ట్ర జట్టు తరఫున జిల్లా క్రీడాకారిణులు సజీద, హిమజ పాల్గొననున్నారు. ఎంపికైన క్రీడాకారులను అంతర్జాతీయ కబడ్డీ క్రీడాకారుడు, విద్యుత్తుశాఖ విజిలెన్స్ సీఐ విశ్వనాథ్‌చౌదరి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ లక్ష్మణ్, సీనియర్ క్రీడాకారులు శ్యాంకుమార్, రాఘవేంద్ర, శాప్ కోచ్‌లు అనీల్‌కుమార్, సంధ్యలు జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారిణులను అభినందించారు.

ఉద్యాన పథకాలను వాడుకోండి

● డీడీలు ఉమాదేవి, చంద్రశేఖర్

అనంతపురం అర్బన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఉద్యాన పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని అనంతపురం ఉద్యాన శాఖ డీడీ ఉమాదేవి, శ్రీసత్యసాయి జిల్లా డీడీ చంద్రశేఖర్ గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మామిడి, జామ, చీనీ, దానిమ్మ, సీతాఫలం, సపోటా, రేగు, అరటి, బొప్పాయి, ద్రాక్ష, డ్రాగన్ ఫ్రూట్, అవకాడో, అంజూర, ప్యాషన్ ఫ్రూట్, ఉసిరి, నేరేడు, చింత, ఫల్సా ఫ్రూట్, విడి పూల సాగు, హైబ్రీడ్ కూరగాయలు, పుట్టగొడుగుల పెంపకానికి ప్రభుత్వ సబ్సిడీ వర్తింపస్తుందన్నారు. పాతతోటల పునరుద్ధరణ, రక్షిత సేద్యంలో భాగంగా పాలి హౌస్, షేడ్‌నెట్, కవర్స్, ప్లాస్టిక్ మల్చింగ్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. పంట కోత అనంతరం చర్యల యాజమాన్యంలో భాగంగా ప్యాక్ హౌస్, యూనిట్ ప్రాసెసింగ్, కోల్డ్ రూమ్ తదితర వాటిని మంజూరు చేస్తామన్నారు. ఉద్యాన యంత్రీకరణలో భాగంగా మినీ ట్రాక్టర్లు, పవర్ టిల్లర్, తైవాన్ స్ప్రేయర్లను అందజేస్తామన్నారు. స్థానిక ఉద్యాన శాఖ కార్యాలయాలు, రైతు సేవా కేంద్రాల్లోని అధికారులు, సిబ్బందిని సంప్రదించి, ఈ ఆర్థిక సంవత్సరంలో ఉద్యాన పథకాల కోసం అర్హులైన రైతులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

రేపు మెగా జాబ్‌మేళా

రాయదుర్గంరూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాకు చెందిన నిరుద్యోగులకు పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఈ నెల 28న జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ నరసింహారెడ్డి, జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి పీవీ ప్రతాప్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రముఖ ఎంఎన్‌సీ కంపెనీల ప్రతినిధులు కళాశాలకు వస్తున్నారని జిల్లాకు చెందిన నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారని వారు తెలిపారు. 9182920381 నంబర్‌కు కాల్ చేసి పూర్తి వివరాలు తెలుసుకోవాలన్నారు.

పీఎస్ఓలకు శిక్షణ ప్రారంభం

అనంతపురం క్రైం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పర్సనల్ సెక్యూరిటీ ఆఫీసర్‌లకు (గన్‌మెన్) ఆరు రోజుల పాటు శిక్షణ ఇస్తామని ఏఆర్ అదనపు ఎస్పీ ఇలియాస్ బాషా తెలిపారు. డీటీసీలో శిక్షణా తరగతులను గురువారం ఆయన ప్రారంభించారు. పీఎస్ఓలకు ఫిట్‌నెస్, ముందు జాగ్రత్తలు, ఆయుధ వినియోగం, ఫైరింగ్ తదితర అంశాలపై శిక్షణ ఇస్తామని తెలిపారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ పవన్ కుమార్, ఆర్ఎస్ఐలు జాఫర్, బాబ్జాన్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మీదుగా బెంగళూరు-గ్వాలియర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్

గుంతకల్లు, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): బెంగళూరు-గ్వాలియర్ మధ్య (వయా అనంతపురం) వీక్లీ ఎక్స్‌ప్రెస్ రైలును శాశ్వత ప్రాతిపదికన ప్రారంభించనున్నట్లు రైల్వే అధికారులు గురువారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. బెంగళూరు-గ్వాలియర్ వీక్లీ ఎక్స్‌ప్రెస్ (11085) రైలు ఈ నెల 29 నుంచి ప్రతి ఆదివారం బెంగళూరులో మధ్యాహ్నం 3-50 గంటలకు బయలుదేరుతుందని తెలిపారు. ఈ రైలు మంగళవారం ఉదయం 10-25 గంటలకు గ్వాలియర్‌కు చేరుకుంటుందన్నారు. దీని తిరుగు ప్రయాణపు రైలు (11086) జూలై 4 నుంచి ప్రతి శుక్రవారం నడుస్తుందన్నారు. ఈ రైలు గ్వాలియర్‌లో మధ్యాహ్నం 3 గంటలకు బయలుదేరి ఆదివారం ఉదయం 7-35 గంటలకు బెంగళూరుకు చేరుకుంటుందన్నారు. ఈ రైలు యల్హంక, హిందూపురం, ధర్మవరం, అనంతపురం, డోన్, కర్నూలు సిటీ, గద్వాల, మహబూబ్‌నగర్, కాచిగూడ, ఖాజాపేట్, బెల్లంపల్లి, సిర్పూర్ కాగజ్‌నగర్, బాలార్షా, చంద్రాపూర్, సేవాగ్రాం, నాగపూర్, బేతుల్, భోపాల్, విదిషా, బీనా, అశోక్‌నగర్, గుణ, శివపురి స్టేషన్ల మీదుగా వెళ్తుందన్నారు. ఈ రైల్లో 2 ఏసీ టూటైర్, 4 ఏసీ త్రీటైర్, 3 ఏసీ త్రీటైర్ ఎకానమీ, 7 స్లీపర్ క్లాస్, 4 జనరల్ సెకెండ్ క్లాస్, ఒక సెకెండ్ క్లాస్ లగేజ్ కం డిసేబుల్డ్ ఫ్రెండ్లీ కంపార్టుమెంట్, ఒక లగేజ్ కం జనరేటర్ కం బ్రేక్ వ్యాన్ కోచ్ ఉంటాయన్నారు.

న్యూస్ బాక్స్

ఇంటి వద్దే రేషన్ పంపిణీ



ధర్మవరంలో వృద్ధురాలికి రేషన్ పంపిణీ చేస్తున్న అధికారులు

ధర్మవరం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాల మేరకు స్థానిక తహసీల్దార్ సురేశ్, వీఆర్‌ఓ రవిశేఖర్‌రెడ్డి, డీలర్ అనిల్ కుమార్ గురువారం పట్టణంలోని పీఆర్‌టీ వీధిలో నివాసముంటున్న వృద్ధురాలి ఇంటి వద్దకు వెళ్లి రేషన్ బియ్యాన్ని అంద జేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ... ఈ నెలాఖరు వరకు వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి వద్దకే వెళ్లి రేషన్ బియ్యాన్ని అందించాలని ప్రభుత్వం ఆదేశించిందన్నారు. డీలర్లు తప్పని సరిగా పాటించాలన్నారు. అలాగే జూలై 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు కార్డు లబ్ధిదారులు చౌకడిపోల వద్దకు వెళ్లి బియ్యం, నిత్యావసర సరుకులు తెచ్చుకోవాలని తహసీల్దార్ సూచించారు.

● గాండ్లపెంట: మండలంలోని పలువురు వృద్ధులు, దివ్యాంగులకు గురువారం వారి ఇంటి వద్దే రేషన్ పంపిణీ చేశారు. మండలంలో 24 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ప్రభుత్వ ఆదేశాల మేరకు చౌక డిపోల వద్దకు రాలేని వృద్ధులు, దివ్యాంగు ఇంటి వద్దకు వెళ్లి రేషన్ అందిస్తున్నట్లు సీఎస్‌డీటీ వాణి తెలిపారు.

ఏడీఏ జాఫర్ సనావుల్లా బాధ్యతల స్వీకరణ

కదిరి అర్బన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): స్థానిక డివిజన్ వ్యవసాయ శాఖ ఏడీగాగా జాఫర్ సనావుల్లా గురువారం బాధ్యతలు స్వీకరించారు. పుట్టపర్తి డీఆర్‌సీలో ఏడీగా పనిచేస్తున్న ఆయన బదిలీపై కదిరికి వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఏడీఏ సత్యనారాయణ ఉరవకొండకు బదిలీపై వెళ్లారు.

సైన్యంలో చేరాలనుకునే వారికి సలహాలు: సీఐ

కొత్తచెరువు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఆర్మీ, ఎయిర్‌ఫోర్స్, నేవీలో చేరేందుకు ఆసక్తి ఉన్న యువతీ యువకులకు సలహాలు, సూచనలు ఇస్తున్నట్లు కొత్తచెరువు అప్‌గ్రేడ్ సీఐ మారుతీ శంకర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల కేంద్రంలోని జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో వారికి కోచింగ్‌తో పాటు పోటీ పరీక్షలకు అవసరమైన సూచనలు ఇస్తున్నట్లు తెలిపారు. రోజూ ఉదయం 6 గంటల నుంచి ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న మండలంలోని యువతీయువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పేర్కొన్నారు.

సర్వేలపై అవగాహన

నల్లచెరువు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తొమ్మిది రకాల సర్వేలను ఇంటింటా తిరుగుతూ సచివాలయ ఉద్యోగుల పూర్తి చేయాలని డీఎల్‌డీఓ వెంకటరత్నం పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం ఎంపీడీఓ రఘునాథ గుప్త ఆధ్వర్యంలో సచివాలయ ఉద్యోగులకు సర్వేలపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం చేపట్టిన ఆధార్‌లేనివారు, మరణ, జనన తదితర సర్వేలను ఇంటింటా తిరుగుతూ అవగాహన కల్పించి, సర్వేలను త్వరగా పూర్తి చేయాలని సూచించారు.

డీలర్ల సంఘం అధ్యక్షుడిగా మంజునాథ్



అధ్యక్షుడు మంజునాథ్, ఉపాధ్యక్షుడు రెడ్డెప్పరెడ్డి

తనకల్లు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండల డీలర్ల సంఘం అధ్యక్షుడిగా మండలపరిధిలోని కోర్తికోటకు చెందిన మంజునాథ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు డీలర్లు తెలిపారు. అలాగే ఉపాధ్యక్షుడిగా పెద్ద కడపలవారిపల్లికి చెందిన రెడ్డెప్పరెడ్డిని ఎంపిక చేశారు. మండ లంలోని డీలర్లు గురువారం మండలకేంద్రంలో సమావేశమై సంఘాన్ని ఏర్పాటు చేసుకున్న ట్లు తెలిపారు. గత వైసీపీ పాలనలో తమకు సంఘాలు లేకపోవడంతో చాలా ఇబ్బందులు పడ్డామన్నారు. సమస్యల పరిష్కారం కోసం సంఘాన్ని ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు మంజునాథ్ మాట్లాడుతూ... మండలంలోని డీలర్ల సమస్యల పరిష్కారం కోసం తనవంతు సహకారం అందిస్తామన్నారు. డీలర్లు అందరూ తప్పకుండా ప్రభుత్వ నిబంధనలు పాటించాలని కోరారు.

రోడ్డు మధ్యలో గుంతలు పూడ్చిన పోలీసులు

ఆంధ్రజ్యోతికి స్పందన

కొత్తచెరువు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని నాలుగు రోడ్ల కూడలిలో రోడ్డు మధ్యలో పడిన గుంతలను పోలీసుల ఆధ్వర్యంలో పూడ్చారు. 'రోడ్డు మధ్యలో గుంతలు' అనే కథనం ఈ నెల 15న ఆంధ్రజ్యోతి దిన పత్రికలో ప్రచురితమైన విషయం తెలిిందే. దీనిపై స్పందించిన స్థానిక సీఐ మారుతీశంకర్ తన సొంత డబ్బుతో రోడ్డుపై పడిన గుంతలను పూడ్చి వేయించారు. ఈ రోడ్డుపై పడ్డ గుంతలతో తరచూ ప్రమాదాలు జరిగేవి. సీఐ స్పందించి రోడ్డుపై పడ్డ గుంతలను పూడ్చివేయడంతో వాహన దారులు, ప్రజలు పోలీసులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ధర్తీ ఆబా అభియాన్‌పై ర్యాలీ

తనకల్లు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ధర్తీ ఆబా జన భాగిధారి అభియాన్ కార్యక్రమంపై మండలంలోని దేవళంతండా గ్రామంలో గురువారం ఎంపీడీఓ రామానాయక్ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ... పిల్లలందరినీ పాఠశాలలో చేర్పించాలన్నారు. చిన్నారులకు విద్యే ముద్దని, పనులకు పంపవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలి

● ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య

ధర్మవరం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): సారా రహిత గ్రామాలుగా తీర్చిదిద్దాలని అనంతపురం ప్రొహిబిషన్, ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ నాగమద్దయ్య సూచించారు. ఆయన గురువారం ఆయన ధర్మవరం ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... నాటుసారా తయారీ, విక్రయం, రవాణపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. దాడులు నిర్వహిస్తూ సారా రహిత గ్రామాలుగా మార్చాలన్నారు. దుకాణాలలో ఎమ్మార్పీకే మద్యం అమ్మాలన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం ఎక్సైజ్‌శాఖ సీఐ చంద్రమణి, ఎస్‌ఐ చాంద్‌బాషా, నాగరాజు, సిబ్బంది పాల్గొన్నారు.



ఎక్సైజ్ కార్యాలయాన్ని తనిఖీ చేస్తున్న డిప్యూటీ కమిషనర్

అసంపూర్తి నిర్మాణాలతో ఇబ్బందులు

● అర్ధాంతరంగా నిలిచిపోయిన తరగతి గదులు, మరుగుదొడ్లు, వంట గది

● అవస్థలు పడుతున్న విద్యార్థులు, భోజన ఏజెన్సీ



అర్ధాంతరంగా ఆగిన తరగతి గదులు

అమడగూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని జౌకల కొత్తపల్లిలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అసౌకర్యాలతో ఇబ్బంది పడుతున్నారు ఈ పాఠశాలలో దాదాపు 80మందికి పైగా చదువుతున్నారు. ఈ పాఠశాలకు గత వైసీపీ ప్రభుత్వంలో నాడు - నేడు పథకం కింద మూడుఅదనపు తరగతి గదులు, వంటగదితో పాటు మరుగుదొడ్లను మంజూరు చేశారు. పనులు మొదలు పెట్టి గోడల వరకు నిర్మించారు. అక్కడితో పనులు ఆగిపోయాయి. ఫలితంగా విద్యార్థులు అసౌకర్యాలతో ఇబ్బందులు పడుతున్నారు. తరగతి గదుల సంగతి ఎలా ఉన్నా... మరుగుదొడ్ల నిర్మాణం అర్ధాంతరంగా ఆగిపోయాయి. దీంతో విద్యార్థినులు అవస్థలు పడాల్సి వస్తోంది. అలాగే వంటగది విషయంలోనూ సమస్యగానే ఉంది. మధ్యాహ్న భోజన ఏజెన్సీ వారు ఇంటి వద్దే భోజనం వండి పాఠశాలకు మోసుకురావాల్సి వస్తోంది. ఆయా గదుల పనులు సకాలంలో పూర్తి అయి ఉంటే, పిల్లలకు చాలా ప్రయోజనకరంగా ఉండేది. ప్రభుత్వం నిధులిచ్చినా పనులు అసంపూర్తిగా మిగిలిపోవడంతో అసౌకర్యాల నడుమ విద్యార్థులు చదువుకోవాల్సిన దుస్థితి ప్రస్తుతం నెలకొంది. దీనికి తోడు చేపట్టాల్సిన పనులకు నిధులున్నా, అయితే పాఠశాల కమిటీ సభ్యులు ఐక్యతతో ముందుకు రావాల్సి ఉంది. పాఠశాల కమిటీ సయోధ్యతో అంగీకారం తెలిపితే పనులు పూర్తిచేయడానికి అవకాశముంది. అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, కమిటీ సభ్యులు సమన్వయంతో పనిచేసి, విద్యార్థులకు సరైన సదుపాయాలు కల్పించాలని తల్లిదండ్రులు కోరుతున్నారు.

ఇంటి వద్దే వండి తెస్తున్నాం

పాఠశాలలో దాదాపు 80మంది విద్యార్థులు ఉన్నారు. రోజూ మా ఇంటి వద్దే వండి భోజన పదార్థాలను నెత్తిన పెట్టుకుని పాఠశాలకు మోసుకొని వస్తున్నాం. తెచ్చిన అన్నం, కూరల విద్యార్థులకు వడ్డిస్తున్నాం. ఇందు కోసం మూడుమార్లు పాఠశాలకు, ఇంటికి తిరగాల్సి వస్తోంది. దీంతో చాల ఇబ్బంది పడుతున్నాం. పాఠశాలలో వంటగది పూర్తి చేస్తే, విద్యార్థులకు మధ్యాహ్నాభోజనం అక్కడే వండి వడ్డించడం సులువుగా ఉంటుంది.

- మాధవి, మధ్యాహ్న భోజన ఏజెన్సీ నిర్వాహకురాలు

కమిటీ సభ్యులు ముందుకు రావాలి

పాఠశాల కమిటీ సభ్యులు ముందుకొస్తే వంటగది, మరుగుదొడ్లు, నిర్మించేందుకు వీలు కలుగుతుంది. తద్వారా విద్యార్థులకు సౌకర్యాలు ఉండేలా చూస్తాం. వాటి నిర్మాణానికి కావలసిన నిధులు ఉన్నాయి. కమిటీ సభ్యులతో చర్చించి పూర్తి చేస్తాం.

- బడా రఘునాథరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు, జౌకల పాఠశాల

మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి

● ఎమ్మెల్యే కందికుంట



ప్రతిజ్ఞ చేస్తున్న యువత



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

కదిరి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): యువత మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పట్టణంలో గురువారం ఎక్సైజ్ శాఖ, పోలీసుల ఆధ్వర్యంలో యువతతో కలిసి అవగాహన ర్యాలీ నిర్వహించారు. పట్టణంలోని ఆర్‌అండ్‌బీ బంగ్లా నుంచి, అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా పాల్గొన్న ఎమ్మెల్యే మాట్లాడుతూ మత్తు పదార్థాలతో యువత పెడదారి పడుతోందన్నారు. మత్తుతో అనేక అనార్థలు జరుగుతున్నాయన్నారు. పిల్లలు మత్తు పదార్థాలకు అల వాటు పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు దృష్ట పెట్టాలని కోరారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ, నినాదాలు చేయించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శివనారాయణస్వామి, సీఐ నారాయణ రెడ్డి, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

11సీట్లు వచ్చినా బుద్ధి రాలేదా?

● మాజీ సీఎం జగన్‌పై చిలకం మండిపాటు



మాట్లాడుతున్న చిలకం మధుసూదన్‌రెడ్డి

ధర్మవరం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గత ఐదేళ్ల పాలనలో నీవు చేసిన అక్రమాలతో ప్రజలు విసిగిపోయి, నీ పార్టీని 11సీట్లకు పరిమితం చేసినా బుద్ధి రాలేదా అంటూ మాజీ సీఎం జగన్‌రెడ్డిపై జనసేన పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డి తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఆయన గురువారం పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇటీవల జగన్ నిర్వహించిన పల్నాడు జిల్లా సత్తెనపల్లి పర్యటన సందర్భంగా వైసీపీ కార్యకర్త సింగయ్య అనే వ్యక్తి ఆయన కారు కిందపడి చనిపోయినా కనికరం చూపలేదన్నారు. పైగా డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌పై, ప్రస్తుత ప్రభుత్వంపై వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో రాష్ట్రమంతా అతలాకుతలమైందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో సుపరిపాలన సాగుతోందన్నారు. రాష్ట్రాభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తున్న సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌పై లేనిపోని ఆరోపణలు చేస్తే సహించేదిలేదని హెచ్చరించారు. పేర్నినానీ... మా నాయకుడు పవన్‌కల్యాణ్‌పై విమర్శలు చేస్తున్నావ్... జాగ్రత్త.... అన్నారు.

మతిలేకే వైపీపీ నాయకుల మాటలు

● టీడీపీ ముస్లిం మైనార్టీ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్‌రఫీ

పుట్టపర్తి రూరల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఎన్నికల హామీ మేరకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి రెండింటికి ప్రాధాన్యమిస్తూ సూపర్ సిక్స్ పథకాలను అమలుచేస్తోందని టీడీపీ ముస్లిం మైనారిటీ రాష్ట్ర కార్యదర్శి మహమ్మద్‌రఫీ అన్నారు. అది చూసి ఓర్వలేక వైసీపీ నాయకులు మతిలేకుండా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. ఆయన గురువారం సాయంత్రం పట్టణంలోని తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడగానే ఎన్నికల హామీ మేరకు సంక్షేమం, అభివృద్ధి రెండింటిమీ ప్రాముఖ్యమిస్తూ సూపర్‌సిక్స్ పథకా పథకాలను అమలు చేస్తోందన్నారు. అది ఓర్వలేక వైసీపీ అగ్రనాయకత్వం మతిచెడి మాట్లాడుతున్నారని అన్నారు. అధికారంలో ఉండగా రాష్ట్రాన్ని సర్వనాశనం చేసినందుకు ప్రజలు ప్రతిపక్షహోదాకూడా లేకుండా 11 సీట్లిచ్చినా వైసీపీ నాయకులకు బుద్ధిరాలేదన్నారు.

మానసిక రోగి జగన్

● ఎమ్మెల్యే కందికుంట

● 20వ వార్డులో మన ఇంటికి మన ఎమ్మెల్యే

కదిరి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ అధ్యక్షుడు జగన్మోహన్‌రెడ్డి మానసిక రోగి అని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పేర్కొన్నారు. ఎమ్మెల్యే గురువారం పట్టణంలోని 20వార్డులో మన ఇంటికి మన ఎమ్మెల్యే కార్య క్రమాన్ని నిర్వహించారు. ఆయన ఇంటింటికెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వైసీపీ అధ్యక్షు డు జగన్మోహన్‌రెడ్డి మానసిక రోగంతో బాధపడుతున్నారని, అందుకే టీడీపీ మ్యానిఫెస్టో పట్టుకుని ఇంటింటికెళ్లి అడగాలని వైసీపీ నాయకుల కు చెబుతున్నారన్నారు. వారేమో బయటకొచ్చి ఇదేక్కడి ఖర్మ మాకంటు న్నారని తెలిపారు. సంవత్సరం కాలంలోనే తాము పలు సంక్షేమ కార్యక్ర మాలు అమలు చేశామన్నారు. ఏ గడపకు పోయినా తల్లులు సంతోషం గా ఆహ్వానిస్తున్నారని తెలిపారు. ఎక్కడైనా తల్లికి వందనం పడనివారు ఉంటే, సంబంధిత సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఏ ముఖం పెట్టుకుని వైసీపీ వారు ఇంటింటికి వెళ్తతారని ప్రశ్నించారు. మ్యానిఫెస్టో పెట్టుకుని వైసీపీ నాయకులు ఇంటింటికి రావాలని ఆయన సవాల్ విసిరారు. వార్డుల్లో మురుగునీటి కాలవలు, 11కేవీ వైర్ల స మస్యలు, పింఛన్లు, ఇళ్ల సమస్యలను ప్రజలు ఎమ్మెల్యే దృష్టికి తీసుకె ళ్లారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ మురళీక్రిష్ణ, మున్సిపల్ కమిషనర్ కిరణ్ కుమార్‌తో పాటు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాగునీటి కాలువలోకి వ్యర్థ పదార్థాలు

● నియంత్రించాలని సాగునీటి సంఘం ఉపాధ్యక్షుడి వినతి

బుక్కపట్నం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): స్థానిక చెరువు నుంచి పంట పొలాలకు వెళ్లే ప్రధాన కాలువలోకి ఇళ్లలోని మురుగునీరు, వ్యర్థపదార్థాలు చేరకుండా చర్యలు తీసుకోవాలని సాగునీటి సంఘం ఉపాధ్యక్షుడు సంజీవరాయుడు కోరారు. ఈ మేరకు ఆయన గురువారం రైతులతో కలిసి పంచాయతీ కార్యదర్శి సిద్ధిక్ బాషా, ఇరిగేషన్ శాఖాధికారులకు వారివారి కార్యాలయాల్లో వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెరువు నుంచి పంట పొలాలకు వెళ్లే ప్రధాన సాగునీటి కాలువలు ఆక్రమణకు గురవుతున్నాయని వాపోయారు. అంతేగాకుండా ఇళ్లలోని వ్యర్థపదార్థాలు, మురుగునీరు చేరడంతో సాగు నీటి కాలువలు అధ్వానంగా తయారవుతున్నాయని అన్నొన్నారు. కాలువల్లోకి మురుగునీరు, ఆక్రమణలు చేరకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రైతులు అక్కులప్ప, ఆదినారాయణ, వారాదప్ప, కేశప్ప, జెండాల రామాంజి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్‌పై అవగాహన

ఓబుళదేవరచెరువు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2025పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీఓ శివరామప్రసాద్‌రెడ్డి, ఈఓఆర్‌డీ ఆంజనప్ప పంచాయతీ కార్యాదర్శులకు అవగాహన కల్పించారు. కార్యదర్శులు మల్లికార్జున, రామాంజనేయులు, రఫీ, పద్మజ, చంద్ర, నిర్మల, గంగాధర్‌నాయక్, ఎమ్మార్పీ రమణనాయక్ తదితరులు పాల్గొన్నారు.

● తనకల్లు : స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం అధికారులకు స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. గ్రామీణ ప్రాంతాల్లో వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. ఎంపీడీఓ రామానాయక్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ భానుప్రకాశ్, జిల్లా కోఆర్డినేటర్ ఆనంతకుమార్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

సద్భావంతో పనిచేస్తే సమస్యలు పరిష్కారం

● ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి

నల్లమాడ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధికి కలిసికట్టుగా పనిచేద్దామని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి పిలుపునిచ్చారు. ప్రజలకు సేవ చేయాలన్న సద్భావంతో పనిచేస్తే సమస్యలు పరిష్కారం అవుతాయని పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురు వారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రజల నుంచి ప్రభుత్వ కార్యాలయాలకు సమస్యలపై వచ్చే ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించి, వారు అధికారుల చుట్టూ తిరగకుండా పరిష్కరించాలని సూచించారు. బాగా ఆలోచిస్తే ఎంతటి క్లిష్టమైన సమస్యనైనా అవకాశం ఉన్నంత వరకు పరిష్కరించవచ్చని తెలిపారు. గోపేపల్లి తండాలో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న చుక్కల భూముల సమస్యకు మూడురోజుల్లో పరిష్కారం చూపిన తహసీల్దార్ రంగనాయకులను ఎమ్మెల్యే అభినందించారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమపథకాలను స్థానిక ప్రజాప్రతినిధులకు తెలియజేయాలని అధికారులపై సూచించారు. గ్రామాల్లో విద్యుత్, తాగునీరు, వైద్యం, పారిశుధ్యం, ఉపాధి పనులు సక్రమంగా అమలయ్యేలా చూడాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులపై ఉందన్నారు. ప్రజలు, రైతుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులకు సూచించారు. ఎన్నికల హామీలన్నీ ఒక్కొక్కటిగా నెరవేరుస్తున్నామని అన్నారు. ఈ సమావేశంలో ఎంపీపీ సునీతబాయి, తహసీల్దార్ రంగనాయకులు, ఎంపీడీఓ ఆజాద్, సూపరింటెండెంట్ గజ్జల శ్రీనివాస రెడ్డి, అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులున్నారు.

కేజీబీవీలో ఎమ్మెల్యే విద్యాబోధన

నల్లమాడ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని కస్తూర్బా పాఠశాలలో 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి గురువారం పాఠ్యాంశాలు బోధించారు. విద్యార్థులకు గణితం, సైన్సు, హిందీ పాఠ్యాంశాలను బోధించి, ప్రశ్నలను అడిగి జవాబులు రాబట్టారు విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరాతీశారు. మెనూ ప్రకారం పౌష్టికారం అందించాలన్నారు. రికార్డులు పరిశీలించారు.

ఘనంగా అమావాస్య పూజలు



అలంకరణలో కాలభైరవ స్వామి

ధర్మవరం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్వయంభూ కాలభైరవ స్వామి ఆలయంలో బుధవారం రాత్రి అమావాస్య పూజలను ఘనంగా నిర్వహించారు. అర్చకులు ధనుంజయ ఆచారి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే అమావాస్య ఘడియల్లో అర్చకులు కాలభైరవస్వామి ఉత్సవమూర్తిని ప్రత్యేకంగా అలంకరించి ఆలయం ఎదుట కూష్మాండ దీపోత్సవాన్ని ప్రారంభించారు. పలు ప్రాంతాల నుంచి భక్తులు అధికంగా తరలివచ్చి, ఆలయం ఎదుట గుమ్మడికాయపై దీపాలు వెలిగించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు.



ఆలయం ఎదుట దీపాలు వెలిగిస్తున్న మహిళలు

అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు: ఆర్డీఓ

బత్తలపల్లి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఎటువంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీఓ మహేష్ సూచించారు. ఆయన గురువారం మండలపరిధిలోని రామాపురం సమీపంలో చిత్రావతి నదిని పరిశీలించారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఎక్స్‌కవేటర్ సాయంతో రెండు ట్రాక్టర్ల ద్వారా అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించారు. వాటికి జరిమానా విధించారు. అనంతరం ఆర్డీఓ మాట్లాడుతూ... ఇసుక కావాల్సిన వారు ప్రభుత్వం కేటాయించిన రీచ్‌లలో మాత్రమే తీసుకోవాలని, అనుమతి లేకుండా తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని వారిని హెచ్చరించారు. ఇసుక తరలింపులో ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చ రించారు. ఆర్డీఓ వెంట తహసీల్దార్ స్వర్ణలత తదితరులు పాల్గొన్నరు.

విద్యుదాఘాతంతో బాలుడికి గాయాలు

కదిరి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నిజావంలీకాలనీకి చెందిన దాదాపీర్ అనే ఎనిమిదేళ్ల బాలుడు విద్యుదాఘాతమై గాయపడ్డాడు. బాలుడు గురువారం ఇంటివద్ద ఆడుకుంటూ పక్కనే ఉన్న రాయిపైకి ఎక్కి చేతిని పైకెత్తాడు. పైన ఉన్న విద్యుత్ తీగలు చేతికి తగిలి విద్యుదాఘాతమైంది. అతడి కాళ్లు, చేతులకు తీవ్రగాయాలయ్యాయి. బాలుడిని కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం అనంతపురం తరలించినట్లు బంధువులు తెలిపారు.

మాదక ద్రవ్యాలతో మానవ మనుగడకే ప్రమాదం

మండల న్యాయసేవ అధికార సంస్థ చైర్‌పర్సన్ జయలక్ష్మి



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయాధికారి జయలక్ష్మి

కదిరి లీగల్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మాదకద్రవ్యాల వినియోగం మానవ మనుగడకే ప్రమాదకరమని మండల న్యాయసేవ అధికార సంస్థ చైర్‌పర్సన్ జయలక్ష్మి అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం, మానవ అక్రమ రవాణా దినోత్సవం సందర్భంగా స్థానిక గిరిజన గురుకుల ఆశ్రమం పాఠశాలలో సదస్సు నిర్వహించిన సదస్సులో న్యాయాధికారి పాల్గొని మాట్లాడారు. మాదకద్రవ్యాలకు బానిసలైతే బలహీన పడిపోతారని గుర్తుచేశారు. ఆరోగ్యవంతమైన జనం ఉన్న ప్పుడే దేశం శక్తివంతంగా మనగలదన్నారు. కావున మాదక ద్ర వ్యాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఈ సదస్సులో ప్రిన్సి పాల్ వెంకటరమణ, వైద్యాధికారి నాగేంద్రనాయక్, న్యాయవాది లింగాల లోకేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలి

● వక్తల సూచన



ధర్మవరంలో ర్యాలీ చేస్తున్న అధికారులు, పోలీసులు, విద్యార్థులు

ధర్మవరం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని తహసీల్దార్ సురేశ్‌కుమార్ తదితరులు సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం ధర్మవరం వన్‌టౌన్, టూటౌన్ పోలీస్ స్టేషన్‌ల ఆధ్వర్యంలో అధికారులు, విద్యార్థులు తదితరులు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తహసీల్దార్ సురేశ్‌కుమార్, ఎంఈఓ గోపాల్‌నాయక్, టూటౌన్ సీఐ రెడ్డప్ప, రూరల్ సీఐ ప్రభాకర్, ముదిగుబ్బ రూరల్ సీఐ శ్యామరావు, ఎక్సైజ్ శాఖ సీఐ చంద్రమణి హాజరయ్యారు. విద్యార్థులు, ప్రజలతో కలిసి స్థానిక కాలేజ్ సర్కిల్ నుంచి కళాజ్యోతి, ఎన్టీఆర్ సర్కిళ్ల మీదుగా గాంధీ సర్కిల్ వరకు ర్యాలీ నిర్వహించారు. తిరిగి కళాజ్యోతి సర్కిల్‌కు చేరుకుని మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి, ఆర్డీఓ కార్యాలయ ఏఓ ఖతిజన్ కుబ్రా, వీఆర్‌ఓ రవిశేఖర్‌రెడ్డి, న్యాయవాది బాలసుందరి పాల్గొన్నారు.

మత్తుతో ఉజ్వల భవిష్యత్తు నాశనం: డీఎస్పీ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న డీఎస్పీ హేమంత్‌కుమార్, డాక్టర్ బషీర్

ధర్మవరం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు బానిసై కొంతమంది యువత ఉజ్వల భవిష్యత్తును నాశనం చేసుకుంటోందని డీఎస్పీ హేమంత్‌కుమార్ పేర్కొన్నారు. మాదక ద్రవ్యాల వాడకం వల్ల కలిగే అనర్థాలపై ముద్రించిన పుస్తకాన్ని అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం డీఎస్పీ హేమంత్‌కుమార్ ఆవిష్కరించారు. పట్టణంలోని స్పందన ఆస్పత్రి వైద్యులు డాక్టర్ బషీర్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్పందన ఆస్పత్రి మేనేజర్ బాబాఫక్రుద్దీన్, సిబ్బంది దిల్‌దార్ తదితరులు పాల్గొన్నారు.

ఆటోలో చోరీ

- చాకచక్యంగా రూ.1.5 లక్షలు చోరీ చేసిన మహిళలు



మహిళా దొంగలను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

పెనుకొండ టౌన్, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఓ మహిళ వద్ద చాకచక్యంగా డబ్బు చోరీ చేసి పరారవుతున్న ఇద్దరు మహిళలను ఎస్‌ఐ వెంకటేశ్వర్లు పట్టుకున్నారు. ఆయన తెలిపిన మేరకు సోమందేపల్లి గ్రామంలో విద్యుత్ బిల్లులు కట్టించుకునే ప్రైవేట్ ఉద్యోగి వందన విధులు ముగించుకుని ఆటోలో పెనుకొండకు బయల్దేరారు. ఇదే ఆటోలో మరికొందరు పెనుకొండకు బయల్దేరారు. పెనుకొండలో ఆటో దిగిన వందన బ్యాగును పరిశీలించగా అందులో నగదు కనిపించలేదు. వెంటనే ఆటో డ్రైవర్‌ను అడగ్గా మీతోపాటు వచ్చిన మహిళలు చోరీ చేసి ఉంటారని, వారు పెనుకొండ ఆర్టీసీ బస్టాండువద్ద దిగి వేరే ఆటోలో వెళ్లారన్నారు. వెంటనే ఆ ఆటో డ్రైవర్ ఫోన్ నంబర్ కనుక్కుని ఫోన్‌చేశారు. నీ ఆటోలో ఉన్న మహిళలను ఎక్కడ దించావని ప్రశ్నించారు. అతడు స్థానిక రైల్వే స్టేషన్‌లో సమీపంలోని బ్రిడ్జివద్ద ఉన్నారని తెలుపగా అక్కడికి బాధితురాలు స్థానికులతో కలిసి చేరుకున్నారు. అక్కడున్న నిందుతులైన మహిళలను డబ్బు విషయం గట్టిగా నిలదీయడంతో దుస్తుల్లో దాచుకున్న రూ.1.5లక్షల నగదును తిరిగి ఇచ్చారు. ఇంతలో జనాలు చుట్టుముట్టడంతో ఓ మహిళ తన వద్ద ఉన్న బ్లేడుతో నుదుటిపై కోసుకుంది. తీవ్ర రక్తస్రావం కావడంతో ఆమెను పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం పెనుకొండ పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారిస్తున్నారు. ఇద్దరు మహిళలది గుంతకల్లు పట్టణమని, వారి పేర్లు లక్ష్మీ, సరస్వతి అని తేలినట్లు పోలీసులు తెలిపారు. బాధిత మహిళ వందన ఇంకా ఫిర్యాదు ఇవ్వలేదని విచారించి నిందితులపై కేసు నమోదు చేస్తామని ఎస్‌ఐ తెలిపారు.

రైతులకు తీరనున్న కరెంటు కష్టాలు

- రూ.5కోట్లతో విద్యుత్ ఉప కేంద్రం



దొడగట్ట వద్ద ప్రారంభానికి సిద్ధంగా ఉప కేంద్రం

రొద్దం, జూన్ 26 (ఆంధ్రజ్యోతి): దొడగట్టవద్ద శరవేగంగా జరుగుతున్న విద్యుత్ ఉప కేంద్రం పనులు చివరిదశకు చేరుకోవడంతో రైతులకు కరెంటు కష్టాలు తీరనున్నాయి. మండల పరిధిలోని దొడగట్టవద్ద చేపట్టిన 33/11 కేవీ విద్యుత్ ఉప కేంద్రం పనులు పూర్తిదశకు చేరుకున్నాయి. మంత్రి సవిత రైతు కష్టాలను చూసి మూడు నెలల క్రితం రూ.5కోట్ల నిధులతో భూమిపూజచేశారు. వారం రోజుల్లో పనులు పూర్తయ్యే అవకాశం ఉంది. దీంతో వైటిరెడ్డిపల్లి, రంగాపురం, దొడగట్ట, డీఆర్ కొట్టాల, రెడ్డిపల్లి, గౌనిమేకలపల్లి తదితర గ్రామాల రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మత్తుతో జీవితాలు చిత్తు

అదనపు జిల్లా న్యాయాధికారి కంపల్లె శైలజ



హిందూపురం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మత్తుతో జీవితాలు చిత్తవుతాయని హిందూపురం అదనపు జిల్లా జడ్జి కంపల్లె శైలజ, డీఎస్పీ మహేష్ అన్నారు. గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నివారణ దినోత్సవం సందర్భంగా హిందూపురంలో పోలీస్ ఆధ్వర్యంలో కాలేజీ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం పరిగి రోడ్డులోని కల్యాణమండపంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఏడీజే మాట్లాడుతూ మత్తుపదార్థాలు వాడటంవల్ల కుటుంబాలు నాశనం అవుతాయన్నారు. డీఎస్పీ మాట్లాడుతూ గంజాయి, డ్రగ్స్‌కు అలవాటుపడితే మనిషి విచక్షణం కోల్పోతాడన్నారు. కార్యక్రమంలో సీఐలు రాజగోపాల్‌నాయుడు, ఆంజనేయులు, జనార్దన్, అబ్దుర్‌కరీం, ఎక్సైజ్ సీఐ లక్ష్మీదుర్గయ్య, కళాశాల విద్యార్థులు, మహిళలు పాల్గొన్నారు.

మడకశిరలో..



మడకశిర టౌన్: పట్టణంలో గురువారం సాయంత్రం డ్రగ్స్ నిర్మూలనపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అర్బన్ సీఐ నాగేష్‌బాబు, రూరల్ సీఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో సర్కిల్ కార్యాలయం నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ జరిగింది. ర్యాలీలో ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమలతిప్పేస్వామి పాల్గొన్నారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని వారు సూచించారు.

పావగడలో...



పావగడ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మత్తు పదార్థాలకు అందరూ దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్ నుంచి శనిమహాత్మ సర్కిల్ వరకు పోలీసులు, కళాశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. అక్కడ మానవహారంగా ఏర్పడి మత్తపదార్థాలు తీసుకుంటే కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఐ సురేష్, ఎస్‌ఐ విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

గోరంట్లలో..



గోరంట్ల: పట్టణంలోని ఎస్కేడీఆర్ జూనియర్, ఎస్‌పీవీఎం డిగ్రీ కళాశాల విద్యార్థులకు డ్రగ్స్ , మాదకద్రవ్యాలను వాడడం వల్ల కలిగే అనర్థలపై గురువారం అవగాహన కల్పించారు. మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని, చదువుపై శ్రద్ధ పెట్టాలని ప్రిన్సిపాల్ విజయలక్ష్మి సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ విజయలక్ష్మీ, ఎన్ఎస్ఎస్ పీఓలు ఆజాద్, బాలమోహన్, అధ్యాపకులు సుహాసినీ, అరవింద, విద్యార్థులు పాల్గొన్నారు.

డీడీఓ బాధ్యతలకు జంకుతున్న డాక్టర్లు

సిబ్బంది మధ్య సమన్వయ లోపం

గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రిలో కుంటుపడుతున్న అభివృద్ధి



గోరంట్ల ప్రభుత్వ ఆసుపత్రి

గోరంట్ల, జూన్ 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని సామాజిక ఆరోగ్య కేంద్రంలో కొంతకాలంగా తరచూ డీడీఓ (డ్రాయింగ్ అండ్ డిస్బర్సింగ్ ఆఫీసర్)లు మారుతుండడంతో అభివృద్ధి కుంటుపడుతోంది. డీడీఓ బాధ్యతలు తీసుకోవాలంటే డాక్టర్లు జంకుతున్నారు. యేడాది క్రితం ఇక్కడ పనిచేస్తున్న చిన్నపిల్లల వైద్యుడు శివకుమార్ ఉద్యోగోన్నతిపై హిందూపురం బదిలీ అయ్యారు. దీంతో గైనకాలజిస్ట్ పావనికి ఇష్టం లేకపోయినా డీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. ఆమె పనిచేయలేక దీర్ఘకాలిక సెలవులో వెళ్లి విధుల నుంచి వైదొలగారు. అనంతరం ఫిజీషియన్ డాక్టర్ వినోద్‌కుమార్ బాధ్యతలు చేపట్టాల్సి వచ్చింది. ఇలా ఉండగా ఆసుపత్రిలో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగి రాధ మెడికల్ ఆఫీసర్ వినోద్‌తో డ్యూటీ విషయంలో వివాదం తలెత్తింది. ఆమె ఆత్మహత్యాయత్నాకి ప్రయత్నించడంతో తరువాత ఉన్నతాధికారులు ఉద్యోగి రాధను బదిలీ చేశారు. డ్రాయింగ్ అథార్టీ నుంచి వినోద్‌కుమార్‌ను తప్పించారు. ఇష్టం లేకున్నా డాక్టర్ ఉషాకు అధికారులు సర్దిచెప్పి నెలన్నర క్రితం డీడీఓ బాధ్యతలు అప్పగించారు. నాలుగు రోజుల క్రితం హిందూపురం నుంచి చిన్నపిల్లల వైద్యుడు అఫ్తాబ్ గోరంట్లకు బదిలీపై వచ్చారు. ఇలా ఉండగా.. శానిటేషన్ కాంట్రాక్ట్ వర్కర్ లక్ష్మీ విధి నిర్వహణ విషయమై హెడ్‌నర్సు మల్లమాంబతో మంగళవారం గొడవపడి, మాత్రలు మింగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డాక్టర్ ఉషా బుధవారం డ్రాయింగ్ బాధ్యతల నుంచి తప్పుకున్నారు. నూతనంగా వచ్చిన డాక్టర్ అఫ్తాబ్ డీడీఓ బాధ్యతలు అప్పగించడంతో సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరూ సక్రమంగా విధులు నిర్వహించాలని, ఒకరిపై ఒకరు నిందారోపణలు చేసుకుంటూ, గొడవ పడడం మంచిది కాదని హితవు పలికారు. దీనివల్ల ఆసుపత్రికి వచ్చే రోగులకు అసౌకర్యం కలుగుతుందని తెలిపారు.

మళ్లీ మొదటికి..!

పరిష్కారం కాని శ్మశానవాటిక స్థల వివాదం

అధికారులు వేసిన హద్దులను చెరిపేసిన కబ్జాదారుడు

చర్యలు తీసుకుంటాం: తహసీల్దార్



మామిడితోటలో శ్మశానవాటికకు దారి



హద్దుల గుంతలు పూడ్చేసిన కబ్జాదారుడు

పరిగి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): తిరుమలదేవరపల్లి శ్మశానవాటిక స్థల సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. స్థానిక ప్రజల వినతితో కబ్జాకు గురైన స్థలాన్ని సర్వేచేసి శ్మశానవాటికగా వినియోగంలోకి తేవాలని మంత్రి సవిత అధికారులను ఆదేశించారు. స్పందించిన తహసీల్దార్ ఆ ప్రాంతానికి రెవెన్యూ సిబ్బందితో వెళ్లి స్థలాన్ని సందర్శించి సర్వే ద్వారా 1.65ఎకరాల భూమి ప్రభుత్వ పోరంబోకు స్థలమని, ఆ ప్రాంతాన్ని శ్మశానవాటికగా ఉపయోగించుకోవచ్చని గుంతలు తవ్వి హద్దులు వేశారు. అయితే కబ్జాచేసిన వ్యక్తి రెవెన్యూ అధికారులు తవ్విన గుంతలను పూడ్చి ఇది తన భూమి అని ఇందులోకి ఎవరూ రావడానికి వీలులేదని గుంతలను పూడ్చివేశాడు. దీంతో సమస్య మళ్లీ మొదటికి వచ్చింది. దీంతో గ్రామస్థులు సమస్యను తహసీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. పోలీసులకు సైతం ఫిర్యాదు చేశారు. గ్రామంలో ప్రభుత్వ భూమి కబ్జా అవుతోందని, చర్యలు తీసుకోవాలని వారు కోరారు. గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించుకుని మామిడి సాగుచేశాడని, 20 అడుగులు మాత్రం శ్మశానవాటిక రోడ్డుకు స్థలంగా వదిలాడని గ్రామస్థులు అంటున్నారు. వెంటనే సర్వే చేయించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

హద్దులు చెరిపేశారు



రెవెన్యూ అధికారులు స్థలాన్ని సందర్శించి కబ్జా చేసిన భూమి వద్ద హద్దుగా గుంతలు తవ్వారు. అయితే మరుసటి రోజే కబ్జాదారులు ఆ హద్దులను చెరిపివేశారు. దీంతో శ్మశాన వాటికస్థలం పరిస్థితి మొదటికి వచ్చింది.

- పురుషోత్తం, గ్రామస్థుడు

కబ్జాలో శ్మశాన వాటిక..



గ్రామం నుంచి దాదాపు 2. కి.మీల దూరంలో ఉన్న పెన్నా నది తీర ప్రాంతంలో శ్మశాన వాటిక ఏర్పాటు చేశారు. స్థలం కబ్జాకు గురైందని ఫిర్యాదు చేశాం. స్పందించి సర్వేద్వారా స్థలాన్ని కేటాయించారు. గుంతలు పూడ్చేసి కబ్జాదారు ఆ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నాడు.

- చెన్నకేశవ, గ్రామస్థుడు

చర్యలు తప్పవు..

ఉన్నతాధికారుల ఆదేశాలతో శ్మశాన వాటికను సందర్శించి సర్వే చేశాం. స్థలాన్ని కేటాయించాం. అయితే ఓ వ్యక్తి ప్రభుత్వ భూమి తనదేనంటూ హద్దుల గుంతలను పూడ్చేశాడు. ఈ విషయాన్ని స్థానికులు నా దృష్టికి తీసుకువచ్చారు. కబ్జాదారునిపై చర్యలు తీసుకుంటాం.

- హసీనా సుల్తానా, తహసీల్దార్

ఐదు మండలాలకు నూతన కన్వీనర్లు



లక్ష్మీనరసప్ప (గుడిబండ)



నాగరాజు (మడకశిర)



ఈరన్న (రొళ్ల)



తిప్పేస్వామి (అగళి)



కృష్ణమూర్తి (అమరాపురం)



నాగరాజు పట్టణ అధ్యక్షుడు

మడకశిర టౌన్, జూన్26 (ఆంధ్రజ్యోతి): మడకశిర నియోజకవర్గంలో తెలుగుదేశం పార్టీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. గురువారం అన్ని మండలాల కన్వీనర్లు, క్లస్టర్ ఇన్‌చార్జులను ప్రకటించారు. ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజు, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమలతిప్పేస్వామి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ నాయకులతో సమావేశం అయ్యారు. అనంతరం ఐదు మండలాల కన్వీనర్లతో పాటు మడకశిర నగర పంచాయతీ అధ్యక్షులు, క్లస్టర్ ఇన్‌చార్జిలను ప్రకటించారు. నగర పంచాయతీ అధ్యక్షుడిగా ఎస్.నాగరాజు, జనరల్ సెక్రటరీగా తిమ్మరాజు, క్లస్టర్ ఇన్‌చార్జుగా రవికుమార్, కో కన్వీనర్‌గా ఈశ్వర్‌ను ఎంపిక చేశారు. మడకశిర రూరల్ కన్వీనర్‌గా నాగరాజు, జనరల్ సెక్రటరీగా మారుతీరెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జిగా పిఆర్.మురళీబాబు, కో కన్వీనర్ వెంకటాద్రి, కో కన్వీనర్‌గా జి.చంద్రప్ప నియమితులయ్యారు. గుడిబండ మండల కన్వీనర్‌గా డి.ఎస్.లక్ష్మీనరసప్ప, జనరల్ సెక్రటరీగా డి.శ్రీనివాస్‌మూర్తి, క్లస్టర్ కన్వీనర్లుగా బీమరాజు, బి.యు. రాజు, కో కన్వీనర్‌గా గిరిలను ఎన్నుకున్నారు. రొళ్ల మండల కన్వీనర్‌గా జి.కె.ఈరణ్ణ, జనరల్ సెక్రటరీగా ఉగ్రేగౌడ్, క్లస్టర్ కన్వీనర్‌గా బాలక్రిష్ణ, కో కన్వీనర్‌గా మారుతీప్రసాద్‌ను ప్రకటించారు. అగళి మండల కన్వీనర్‌గా డి.తిప్పేస్వామి, జనరల్ సెక్రటరీగా ఎమ్.విశ్వనాథ్, క్లస్టర్ కన్వీనర్‌గా శివకుమార్, కో కన్వీనర్‌గా కె.శివన్నగా ఎన్నికకాగా అమరాపురం మండల కన్వీనర్‌గా ఈ.క్రిష్ణమూర్తి, జనరల్ సెక్రటరీగా ఎమ్.నాగరాజు, క్లస్టర్ కన్వీనర్‌లుగా హెచ్.టి.నవీన్‌కుమార్, క్రిష్ణమూర్తి, కో కన్వీనర్‌గా చిన్నప్పను ఎన్నుకున్నారు. కొత్తగా ఎంపికైన వారికి పలు సూచనలు, సలహాలను ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి ఇచ్చారు.

కన్వీనర్‌కు సన్మానం



ప్రసాద్‌ను సన్మానిస్తున్న కురుబలు

పెనుకొండ టౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండల కన్వీనర్ ఈశ్వరప్రసాద్‌ను పెనుకొండ కురుబ సంఘం ఆధ్వర్యంలో సన్మానం చేశారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయనకు పూలమాలలువేసి సన్మానించారు. కార్యక్రమంలో కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీనివాసులు, సిద్ధలింగప్ప, నంజుండ, శివ, ఆది, వెంకటేశ్, శంకర, ప్రభాకర్, శివయ్య తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌ను రద్దుచేయాలి: సీఐటీయూ

పెనుకొండ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కార్మికుల హక్కులను హరించే విధంగా కేంద్ర ప్రభుత్వం చేసిన లేబర్ కోడ్‌ను వెంటనే రద్దుచేయాలని సీఐటీయూ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సీఐటీయూ నాయకులు మున్సిపల్ వర్కర్స్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ నాయకులు కార్మికుల సమ్మెలపై జూలై 9న చేపట్టనున్న దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నట్లు కమిషనర్ సతీష్‌కుమార్‌కు వినతి పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, నరసింహ, లక్ష్మీదేవి, చంద్ర, కార్మికులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

అగళి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆలూడి మోడల్ ప్రైమరీ స్కూల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయురాలు జయసుధ, ఉపాధ్యాయుడు భోజేగౌడ్ బదిలీ కావడంతో స్కూల్ కమిటీ చైర్మన్ నరసింహరాజు ఆధ్వర్యంలో గురువారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కళాకారులకు సన్మానం



కళాకారులను సన్మానిస్తున్న మున్సిపల్ చైర్మన్

హిందూపురం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): గానగంధర్వ ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం జయంతి సందర్భంగా హిందూపురంలో కళాకారులను సన్మానించారు. గురువారం ఎంజీఎం పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ రమేష్, టీడీపీ నాయకుడు నాగరాజు మాట్లాడుతూ బాలసుబ్రహ్మణ్యం 40వేలకు పైగా వివిధ భాషల్లో పాటలు పాడారన్నారు. అనంతరం పట్టణంలోని కళాకారులను సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ గంగప్ప, హెచ్ఎం రంగనాయకులు, రామలింగప్ప, దయానంద పాల్గొన్నారు.

'ఆడదాం ఆంధ్ర'పై విచారణ

అమరాపురం, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామ సచివాలయ పరిధిల్లో ఆడుదాం ఆంధ్రపై విజిలెన్స్ అధికారులు గురువారం విచారణ జరిపారు. ఆయా గ్రామ సచివాలయ, పంచాయతీ కార్యదర్శుల మండల పరిషత్ అధికారులను విజిలెన్స్ అధికారి సద్గురుడు విచారించారు.



విచారణ చేస్తున్న విజిలెన్స్ అధికారి

యువత అవకాశాలను అందిపుచ్చుకోవాలి

- జాబ్‌మేళాలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎంఎస్ రాజు

మడకశిర టౌన్, జూన్ 26(ఆంధ్రజ్యోతి): యువత వచ్చిన అవకాశాలను అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు సూచించారు. యువతలో నైపుణ్యాభివృద్ధి పెంపొందించడంతో స్వశక్తిగా ఎదిగేందుకు సహకారం అందించడంతోపాటు పరిశ్రమలకు సీఎం చంద్రబాబునాయుడు బ్రాండ్ అంబాసిడర్ అని అన్నారు. గురువారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మెగా జాబ్ మేళా నిర్వహించారు. ఇందులో ఎమ్మెల్యేతోపాటు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమలతిప్పేస్వామి పాల్గొన్నారు. 20కంపెనీలు పాల్గొనగా అందులో 105మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ తల్లిదండ్రులు కష్టపడి పిల్లలను చదివిస్తున్నారని, కొంత మంది ఉన్నత విద్యను అభ్యసించి గ్రామాల్లోనే ఉండిపోతున్నారన్నారు. అలాంటి వారికి ఇలాంటి ఉద్యోగ మేళాలు వరంగా మారుతున్నాయన్నారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలకు దూరమయ్యారని అన్నారు. సీఎం చంద్రబాబు బాధ్యతలు స్వీకరించాక రాష్ట్రానికి పరిశ్రమలు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాస్ మూర్తి, మార్కెట్ యార్డు చైర్మన్ గురుమూర్తి, అన్ని మండలాల కన్వీనర్లు, నాయకులు, వివిధ కంపెనీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

రైతుల ఆర్థిక అభివృద్ధే లక్ష్యం

సెర్ప్ డైరెక్టర్ పద్మావతి



మాట్లాడుతున్న సెర్ప్ డైరెక్టర్ పద్మావతి

చిలమత్తూరు, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఆధునిక వ్యాపార పరిజ్ఞానాన్ని రైతులకు అందిస్తూ వారిని ఆర్థికంగా అభివృద్ధి చేయడమే రైతు ఉత్పత్తిదారుల సమాఖ్య లక్ష్యమని సెర్ప్ డైరెక్టర్ పద్మావతి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సమాఖ్య కార్యాలయంలో రైతు ఉత్పత్తిదారుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యానికి మార్కెటింగ్‌పై అవగాహన పెంచుకొని గిట్టుబాటు ధర పొందేలా చర్యలు తీసుకుంటామన్నారు. రైతులు కేవలం పండించే వారు కాకుండా వాటిని వ్యాపారంగా మార్చే పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని సూచించారు. అందుకు అవసరమైన శిక్షణను సెర్ప్ అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఐదు మండలాలకు చెందిన బోర్డు డైరెక్టర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫార్మ్ వేద సంస్థ ఆధ్వర్యంలో ఉత్పత్తి, ప్రాసెసింగ్, ప్యాకింగ్, మార్కెట్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, డీపీఎంలు శ్రీనివాసులు, రామ్మోహన్, గంగాధర్, రామిరెడ్డి, మండల సమాఖ్య అధ్యక్షురాలు లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

సంఘాలు ఏర్పాటు చేసుకోండి

- ఏడీ శివశంకర్‌నాయక్



సూచనలు ఇస్తున్న డెయిరీ ఏడీ

సోమందేపల్లి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మహిళలు సహకార సంఘాలుగా ఏర్పడి పాల ఉత్పత్తులు అమ్ముకుంటే లాభాలు గడించవచ్చని ఏడీ శివశంకర్‌నాయక్ సూచించారు. గురువారం మండలంలోని గుడిపల్లి గ్రామంలో వెటర్నరీ వైద్యురాలు హేమలతతో కలిసి మహిళలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సంఘాలను ప్రోత్సహిస్తోందన్నారు. సంఘాల సభ్యులు తమ పాల ఉత్పత్తులకు తగిన ధరలు వారే నిర్ణయించి పట్టణాల్లోని డెయిరీలకు విక్రయించే అవకాశం ఉందన్నారు. మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

మున్సిపల్ కార్యాలయానికి రూ.1.05 కోట్ల ఆదాయం

- అధ్యక్షుడు సుదేష్‌బాబు

పావగడ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): ఫిబ్రవరి నుంచి జూన్ వరకు రూ.1.05కోట్ల ఆదాయం మున్సిపల్ కార్యాలయానికి చేకూరిందని అధ్యక్షుడు సుదేష్‌బాబు తెలిపారు. కర్ణాటక ప్రభుత్వం అక్రమ సక్రమ కింద నివేశనాలకు సంబంధిత అర్జీలతో దరఖాస్తు చేసుకున్న వాటిలో 3వేలకుపైగా ఈ ఖాతాలకు అర్జీలు వచ్చాయన్నారు. ప్రస్తుతం వాటిలో దాదాపు 2వేల దాకా ఈ ఖాతాలు సక్రమం చేసి లబ్ధిదారులకు అందజేశామని తెలిపారు. ఆగస్టు వరకు దరఖాస్తుకు అవకాశం ఉందని, వాటిని పరిశీలించి 15 రోజుల్లోపు తిరిగి అందజేస్తామన్నారు.

నేడు కెంపేగౌడ జయంతి

పావగడ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): కెంపేగౌడ జయంతిని పట్టణంలో శుక్రవారం నిర్వహిస్తున్నట్లు కుంచటిగా ఒక్కళిగ ఐక్యత సంఘం తాలూకా అధ్యక్షుడు తిప్ప వీరన్న గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం 12 గంటలకు ఎస్ఎస్‌కే సముదాయ భవనాలు జరిగే కార్యక్రమంలో నిర్వహిస్తామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేయడం జరుగుతుందన్నారు. ముఖ్య అతిథులుగా నంజావదూత స్వామి, హనుమంతానంద స్వామి, ప్రముఖ కన్నడ చలనచిత్ర హాస్యనటుడు రంగయణ రఘు, ఎమ్మెల్యే వెంకటేశ్ పాల్గొంటారని, జయప్రదం చేయాలని కోరారు.

అరెస్టు దారుణం: రైతుసంఘం నాయకులు



ఆందోళన చేస్తున్న రైతుసంఘం నాయకులు

పావగడ, జూన్ 26(ఆంధ్రజ్యోతి): రైతులపక్షాన పోరాడిన నాయకులు బసవరాజప్ప, నాగేంద్రను పోలీసులు అరెస్టు చేయడం దారుణమని రైతుసంఘం, సీపీఐ నాయకులు అన్నారు. బెంగళూరులోని దేవనహళ్లిలో 777 ఎకరాల రైతుల భూములను పరిశ్రమల కోసం ప్రభుత్వం తీసుకోవడాన్ని వారు తప్పుపట్టారు. తుమకూరు జిల్లా కలెక్టర్, పావగడ తహసీల్దార్ కార్యాలయం ముందు రైతు సంఘం, సీపీఐ నాయకులు బైఠాయించి ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతు అరెస్టు చేసిన వారిని విడుదల చేయాలన్నారు. అరెస్టు చేసిన నాయకులను పోలీసులు విడుదల చేశారు.

పశువులకు నట్టలవ్యాధి టీకాలు

పరిగి, జూన్ 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పాపిరెడ్డిపల్లి గ్రామంలో గొర్రెలు, మేకలకు నట్టల వ్యాధి నివారణ కోసం టీకాలు వేశారు. గురువారం పాపిరెడ్డిపల్లిలో గొర్రెలకు, మేకలకు నట్టలనివారణ టీకాలను పశువైద్యాధికారి సోమనాథ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ గోవిందరెడ్డి, పరిగి పంచాయతీ అధ్యక్షుడు తిప్పేస్వామి పాల్గొన్నారు.